సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
ఆదివారం
3.3.2024



# రష్యన్ ఆర్మీకి మద్దతుగా భారతీయుడు

## చైర్మన్‌తో ముఖాముఖి



**నూకారపు సూర్యప్రకాశరావు**
**చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య**

**విధాన సౌధలో కాంగ్రెస్ కార్యకర్తలు పాకిస్థాన్ కు అనుకూలంగా నినాదాలు చేయడంపై కర్నాటక బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేయటంతో పాటు. సిద్ధరామయ్య సర్కారును రద్దు చేయాలని డిమాండ్ కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచడంతో మోడీ సర్కారు కూడా గవర్నర్ ద్వారా దేశద్రోహం పేరుతో సర్కారు రద్దు చేసే ఆస్కారం ఉందన్న వార్తలొస్తున్నాయి. ఇదెంత వరకు నిజం.**

**– వి. రాజశేఖర్ హైదరాబాద్**

అవును ఈ తరహా వార్తా కథనాలు సమాజిక మాధ్యమాలలో పలు కోణాలలో పలు రకాల వ్యాఖ్యానాలతో ప్రసారం అవుతున్న తరుణంలో కేంద్రం ప్రభుత్వ రద్దు దిశగా అడుగులు వేస్తుందా? అన్నది సంశయమే. ఇక ఈ తరహా వివాదం రేగటానికి ప్రధాన కారణం ఇటీవల కన్నడడ నాట జరిగిన రాజ్యసభ ఎన్నికలలో రాజ్యసభ ఎన్నికలలో గెలిచిన ముగ్గురు కాంగ్రెస్ అభ్యర్థులలో నసీర్ హుస్సేన్ ఒకరు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి విధానసౌధ లోపల కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలు 'పాకిస్తాన్ జిందాబాద్' అంటూ నినాదాలు చేశారని బిజెపి ఆరోపించింది. బిజెపి ప్రతిపక్ష నాయకుడు ఆర్ అశోక నేతృత్వంలో పార్టీ నాయకులు 'రాజ్ భవన్ చలో' కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్ కార్యకర్తల నినాదాలపై గవర్నర్ గెహ్లాట్‌కు వివరించి అనంతరం వినతిపత్రం సమర్పించారు. అలాగే నసీర్ హుస్సేన్ మద్దతుదారుల చేసిన దేశ వ్యతిరేక నినాదాలపై జాతీయ దర్యాప్తు సంస్థ లేదా ఇంటెలిజెన్స్ బ్యూరోతో విచారణ జరిపించి, దోషులను చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్ చేయలేని, రాజ్యాంగ విలువలను పరిరక్షించలేని కాంగ్రెస్ సర్కారు రద్దుకు సిఫారసు చేయాలని అశోక డిమాండ్ చేశారు. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ దర్యాప్తు నివేదికను తారుమారు చేయాలని కాంగ్రెస్ యోచిస్తోందని అశోక విలేకరులతో అన్నారు. కాగా ఇదే అంశంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నిన్నటి రోజున స్పందించారు. విచారణలో ఆరోపణలు నిజమని తేలితే నినాదాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఎఫ్ఎస్ఎల్ (ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ) నివేదికలో పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు ఉన్నాయని రుజువైతే, కఠిన చర్యలు తీసుకుంటామని, పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు చేసిన వారిని కాపాడే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు సీఎం సిద్ధరామయ్య. మరి నిజానిజాలు తేలాల్సి ఉంది.

**ఇటీవల తెలుగుదేశం, జనసేన పార్టీలు ఉమ్మడిగా మోగించిన ఎన్నికల ప్రచారభేరి సభ తాడేపల్లిగూడెంలో భారీగా జన సమీకరణ మధ్య జరిగింది. ఒక్క స్టేజ్ మీదనే.. ఐదు వందల మంది ఇరు పార్టీల నేతలు ఉండేలా చూసుకున్నారు. అందరూ వచ్చారు కానీ.. నారా లోకేష్ మాత్రం కనిపించలేదు. ఇంత పెద్ద సభలో ముఖ్యనాయకుడు కనిపించక పోవటం ఇప్పుడు చర్చ అవుతోంది. ఏమై ఉంటుందంటారు సార్.**

**– విజయలక్ష్మి మావూళ్ల, విజయవాడ.**

మీరన్నది నిజమే విజయగారూ... లోకేష్ సభలో కనిపించక పోవటం కాదు అసలు సభకు నారా లోకేష్ రాలేదు. ఎందుకు రాలేదన్నది సభ జరుగుతున్నప్పుడు పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు కానీ.. ఇప్పుడు మాత్రం లోకేష్ ఎందుకు రాలేదన్నదానిపై రాజకీయవర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. నారా లోకేష్ ఉమ్మడి ప్రచారభేరి సభకు కావాలనే దూరంగా ఉన్నారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. అక్కడ చంద్ర బాబు, పవన్ కల్యాణ్ ప్రసంగాలు మాత్రమే హైలెట్ కావాలని .. తాను మాట్లాడితే బాగుండదని లోకేష్ అనుకున్నారని అంటున్నారు. పైగా అది ఉమ్మడి ప్రచార భేరీ సభ. సభా ఏర్పాట్లను జనసేన పార్టీ తీసుకుంది. ఆ పార్టీ నేతలు సభ కోసం కష్టపడ్డారు. ఆ పార్టీ నేతలకే ప్రాధాన్యం ఇవ్వాలని టీడీపీ అనుకుంది. ఆ ప్రకారం.. చంద్రబాబు మాత్రమే ప్రధానంగా ప్రస్తావించారు. మిగిలిన వారిలో ఎక్కువగా జనసేన నేతలే ప్రసంగించారు. చంద్రబాబు, బాలకృష్ణ లాంటి వారు మినహా టీడీపీ నేతలు ఎవరూ పెద్దగా ప్రసంగించలేదని గుర్తు చేస్తున్నారు. మరో వైపు నారా లోకేష్ మంగళగిరిలో తీరిక లేకుండా కార్యక్రమాల్లో ఉన్నారు. రోజూ పలు రంగాల ప్రముఖుల్ని పార్టీలో చేర్చుకుంటున్నారు. బుధవారం రోజున కూడా.. పెద్ద ఎత్తున చేరికలు.. వివిధ కార్యక్రమాలు ఉన్నాయి. ఇప్పటికే పాదయాత్ర కోసం దాదాపుగా ఏడాది పాటు నియోజకవర్గానికి దూరంగా ఉన్నారు. మళ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చే ముందు నుంచి.. ప్రచార బాధ్యతల్ని రాష్ట్రం మొత్తం నిర్వర్తించాల్సి ఉంది. అందుకే నియోజకవర్గంలో సుడిగాలిలా పర్యటించాలని నిర్ణయించుకున్నారని అంటున్నారు. లోకేష్.. మంగళఘురిలో రోజూ పదికిపైగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పార్టీ సీనియర్ నేతల ఇళ్లకే కాదు తటస్థుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పలకరిస్తున్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ పార్టీ కోసం పాదయాత్ర చేసినా.. నారా లోకేష్.. ఓ కార్యకర్తగానే తన కృషి ఉంటుందని..అంతకు మించి క్రెడిట్ తీసుకునేందుకు ఆసక్తిగా లేరని అంటున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ మాత్రమే.. మొత్తంగా హైలెట్ అవుతారని.. అంటున్నారు. టీడీపీ కార్యక్రమాల్లో చంద్రబాబు తర్వాత లోకేష్ కనిపించినప్పటికీ.. ఉమ్మడి సభల్లో మాత్రం.. చంద్రబాబు మాత్రమే ప్రధానంగా ఉంటారని.. ఆ తర్వాత పవన్ కల్యాణ్ ఉంటారని అంటున్నారు.

## లెజెండ్

# జ్ఞానఖడ్గం సంతు రవిదాస్

(గతవారం తరువాయి)

500 సంవత్సరాల క్రితం ఆర్య బ్రాహ్మణ వర్గానికి చెందిన తులసిదాస్ బ్రాహ్మణులు గుణహీనుడు జ్ఞానహీనుడు అయినప్పటికీ పూజించు కానీ శూద్రుడు చమార్ గుణవంతుడు జ్ఞానవంతుడు అయినప్పటికీ పూజించకు అంటే తులసీదాస్ తీసుకొచ్చేన సిద్ధాంతానికి అభిముఖంగా గుణశీలుడు జ్ఞానహీనుడు అయినా బ్రాహ్మణున్ని పూజించకు గుణ సంపన్నుడు జ్ఞాన సంపన్నుడు అయినా చమర్ పాదాలకు నమస్కరించు అని నూతన సిద్ధాంతాన్ని సంతు రావిదాస్ నిర్మించాడు. మనిషికి దేవుడి మధ్య ఉండే సంబంధం గురించి చెప్పడం కాదు పురోహితుడా మనిషికి మనిషికి మధ్య ఉండే సంబంధం ఏంటాని కుల వ్యవస్థను చీల్చి చెండాడి బ్రాహ్మణ పురోహిత వర్గంపై జ్ఞాన పంజని విసిరిన వాడు సంతూ రవిదాస్ తన న్యాయవాదన ప్రతిభతో రాజుల దర్బార్ లో బ్రాహ్మణులని రాజులని ఓడించి వారితోనే బంగారు కడియాన్ని తొడిగించుకొని వారిచేత కాళ్లు కడిగించుకున్న భారతదేశ చరిత్రలో తొలి మాదిగవాడు సంతు రవిదాస్. మాదిగ ధర్మం అంటే మానవ ధర్మమని మొట్టమొదసారి ప్రపంచం ముందు గర్జించిన జ్ఞాన సింహం సంతు రవిదాస్. చమర్(మాదిగ) అంటే ఆత్మ న్యూనతతో బ్రతకాకుండా నిరంతరం చైతన్యులుగా ఉంటూ మాదిగలు బతికితే సింహాసనం మీద కూర్చుంటూ స్వరాజ్యంలో బతకాలి లేకుంటే స్మశానం లో ఉండాలి అంటే అత్యల్ప శాతం ఉన్న అగ్రవర్ణల చేత అత్యధిక శాతం ఉన్న మాదిగలు మరియు బీసీ ఎస్టీ లు బాధితులుగా, పాలితులుగా ఉండడం కంటే చావడం మంచిది అంటూ విప్లవాత్మక సిద్ధాంతానికి పురుడు పోశాడు. మాదిగల నామ రూప గుణాల్లో మార్పు తీసుకొస్తూ మాదిగయేతారులైన బీసీ ఎస్టీ లని ప్రభావితం చేసి వారిలోని అనంతశక్తిని బయటికి తీసిన గొప్ప మానసిక శాస్త్రవేత్త సంతు రవిదాస్. తన జ్ఞానం గానామృతంతో జంబూద్వీప ప్రజలందరినీ తన వెంట తిప్పుకున్న లోక రక్షకుడు సంతు రవిదాస్. దేవుడికి మనిషికి మధ్య పురోహిత బ్రాహ్మణుడు ఎందుకు అనే ప్రశ్నల ఫిరంగులను పేల్చి దేశంలోని బ్రాహ్మణ పూజారులకు ఉక్కిరిబికిరి చేసిన గొప్ప పోరాట యోధుడు సంతు రావిదాస్. బ్రాహ్మణుడు క్షత్రియుడు వైశ్యుల కపట నాటక నిలయమే వారు కట్టించిన గుడి అని గుడి పునాదుల కింద భూకంపం సృష్టించి దేవుడు సర్వంతర్యామి అని చాటి చెప్పిన విప్లవకారుడు సంతు రావిదాస్. నాకు కావాల్సింది గుడి కాదు నా మాదిగల "గుడి" సే నాకు "గుడి" అని ప్రకటించిన తాత్వికుడు,మహాబాటసారి సంతు రవిదాస్. ఏ అడ్డంకులు లేకుండా ముందుకు వెళుతున్న సంతు రవిదాస్ తత్వానికి చిత్తోడు ఘడ్ సంస్థనాధిపతి కూతురు మీరాబాయి శిష్యరికం చేయడం మనువాద రాజులకి నచ్చక కపట ప్రేమతో సంతు రవిదాసు ని చిత్తోడు గడ్ సంస్థానానికి పిలిపించుకొని విషపు భోజనం పెట్టి ముక్కలు ముక్కలుగా నరికి చంపి నడివీధిలో పడేశారు. ఈ సత్యాన్ని బయటకి వ్యాప్తి చెందకుండా దేవుడు ఎక్కడున్నాడు సంతు రవిదాస్ అని ప్రశ్నిస్తే దేవుడు నా గుండెల్లో నా శరీరంలోనే ఉన్నాడు అని చెప్పి ఖడ్గంతో పొడుచుకొని నా గుండెల్లో దేవుడున్నాడు చూడండి అని చెప్తూ మరణించాడని కట్టు కథని అల్లారు మనువాద చిత్తొడ్గడ్ అగ్రకుల రాజ్యాధిపతులు. సిక్కు మత స్థాపకుడు గురునానక్ కె జ్ఞానాన్ని ఇచ్చినవాడు సంతు రవిదాస్ వారి బోధనలు చమార్ సిక్కు మతస్థులు నేటికీ అనుసరిస్తున్నారు.సిక్కు మత ఆదిగ్రంథం లో రవిదాస్ యొక్క 41 కీర్తనలు చేర్చబడినవి.

సంతు రవిదాస్ యొక్క జ్ఞాన గొప్పతనం గురించి తెలుసుకొని తన తొలి గురువుగా ప్రకటించుకొని డాక్టర్.అంబేడ్కర్ తన గ్రంథాలను వారికి అంకితం చేశాడు.నేడు సంతు రవిదాస్ గురు రవిదాస్ గా, జగత్ గురు రవిదాస్ గా అనేక బిరుదులతో కీర్తించబడుతూ భారదేశం లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో సంతు రవిదాస్ మందిరాలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి మాసాన్ని అత్యంత పవిత్రమైనదిగా భావిస్తూ ఫిబ్రవరి మూడో వారంలో భారతదేశం లోనే కాదు ఇతర దేశాల్లో లక్షలాది గా ఉన్న రవిదాస్ అనుచరులు చాలా ఘనంగా వారి జయంతి ఉత్సవాలని చేస్తారు. ఇక అత్యంత ముఖ్య విషయం రవిదాస్ భావాల నుండి పుట్టిన వాడు సంతు కబీర్, కబీర్ భావాల నుండి పుట్టినవాడు శివాజీ, శివాజీ పోరాట స్ఫూర్తి నుండి ఉద్భవించిన వారు జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ కాన్షీరాం లు. కాన్షీరాం తను బహుజన సమాజ్ పార్టీ ని పెట్టడానికంటే ముందు దాదాపు 15 ఏళ్లపాటు చేసిన సామాజిక సాంస్కృతిక ఉద్యమంలో భాగంగా పూలే అంబేడ్కర్ సాహు మహారాజ్ సిద్ధాంతానికి సంతు రవిదాస్ బోధనలని జోడించి ఉత్తరప్రదేశ్ కేంద్రంగా ఉత్తర భారత మొత్తంలో ఎన్నో రాజకీయ విజయాలు సాధించడానికి కాన్షీరాం కి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావం చూపిన వాడు సంతు రవిదాస్. సంతు రవిదాస్ ప్రభావం నేటికీ ఎంత గొప్పగా ఉన్నదంటే



2022 సంవత్సరం లో జరిగిన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియనే జాతీయ భారత ఎలక్షన్ కమిషన్ పోస్ట్ ఫోన్ చేసి సంతు రవిదాస్ ఉత్సవాలు అయిపోయాకనే ఎలక్షన్ కమిషన్ పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలని నిర్వహించింది ఎందుకంటే ప్రతి ఏటా ఫిబ్రవరి నెలలో జరిగే సంతు రవిదాస్ జన్మదిన ఉత్సవాలకు పంజాబ్ మరియు ఉత్తర,దక్షిణ భారత రాష్ట్రాల నుండి లక్షలాది,కోట్లాది మంది చమర్, రవిదాసియా కులస్తులు ఉత్తర ప్రదేశ్ లోని సంతు రవిదాస్ మందిరాన్ని సందర్శిస్తారు. కాన్షీరాం తర్వాత వారి సిద్ధాంతాన్ని తన భుజస్కందాలపై వేసుకొని ధర్మ సమాజ్ పార్టీ(డిఎస్పి) వేదికగా డా. విశారదన్ మహరాజ్ గత 14 సంవత్సరాలుగా తెలంగాణ కేంద్రంగా దక్షిణ భారతదేశంలో పూలే అంబేడ్కర్ కాన్షీరాం ల ఉద్యమాన్ని పునర్జీవింప చేసి ముందుకు కొనసాగిస్తున్నరు. సంతు రవిదాస్ జయంతి ఉత్సవాలలో భాగంగా.. బీసీ ఎస్సి ఎస్టీ సమాజాన్ని జాగృత పరుస్తూ ప్రతి సంవత్సరం కూడా డిఎస్పీ నాయకులు, కార్యకర్తల చేత సంతు రవిదాస్ జన్మదిన ఉత్సవాలను తెలంగాణలో ఒక అద్భుతమైన మహత్తర కార్యంగా చేయిస్తూ కాన్షీరాం పోరాట స్ఫూర్తిని విశారదన్ మహారాజ్ ముందుకు నడిపిస్తున్నారు. కాన్షీరాం వలే సంతు రవిదాస్ ఉద్యమాన్ని ప్రేరణగా తీసుకొని నాడు కాన్షీరాం ఉత్తర భారతంలో జాట్, ఠాగూర్ వర్గాన్ని రాజకీయ ప్రత్యర్థులుగా చూయిస్తూ బహుజన సమాజాన్ని ఏకం చేస్తే, కాన్షీరాం వలె విశారదన్ మహారాజ్ కూడా తెలంగాణలో రెడ్డి, రావు లని 93% బీసీ ఎస్సీ ఎస్టీ లకు రాజకీయ ప్రత్యర్థులుగా చూయిస్తున్నారు. కాబట్టి విశారదన్ మహారాజ్ కాన్షీరాం వలే సంతు రవిదాస్ ప్రేరణతో భవిష్యత్ లో గొప్ప సామాజిక రాజకీయ సాంస్కృతిక ఫలితాలు సాధిస్తారాని చెప్పడం లో ఎలాంటి అతియశోక్తి లేదు ఎందుకంటే సత్యాన్ని విజయం ఆలస్యంగా వరిస్తుందానేది జగమెరిగిన సత్యం.

**పుల్లెంల గణేష్ , 9553041549**

## నవ కవిత్వం

### చివరకు నిలబెట్టేది...!



ఆకాశమంతా చీకటి కమ్మి
ఉరుములతో పిడుగులు పడినపుడు
అకస్మాత్తుగా నీ వీడ్కోలు
నీ వారికి శరాఘాతమవుతుంది..!

నువ్వు మాత్రమే చేయగలవని
ఇన్నాళ్లు విర్ర వీరే పనులన్నీ
అర్ధాంతరంగా ఆగిపోయినపుడు
నీ లెక్కలన్నీ బాపి
శూన్యమౌతాయి..!

దయనీయంగా నీ వారంతా
రోదిస్తున్నపుడు
నువ్వు అహంకారంతో బుస కొట్టిన
నీ పొగరెక్కిన నాలుకకు ఖరీదు కట్టి
చర్చోపచర్చలు సిద్ధమవుతాయి..!
నువ్వు సాధించినవి జల్లెడ పట్టి
వాదోపవాదాల తర్జనబర్జన తర్వాత
నీ ఇసుమెత్తు సహాయాల కోసం
భూతద్దంతో తప్పక వెతుకుతారు.. !

నీలో సహాయ స్ఫూర్తి ఆవగింజంతా
ఉన్నా
శ్మశానంలో మసైన బూడిద సాక్షిగా
వారిలో నిన్ను చిట్ట చివరకు
నిలబెట్టేది
పరోపకారానికై నీవు చేసిన మంచి
పనులే..!!

**డా. వాసాల వరప్రసాద్,**
**9490189847**

## లేఖలు

**ముఖచిత్ర కథనం బాగుంది**

పాకిస్థాన్ నుంచి బిచ్చగాళ్లను తరలిస్తున్న వైనంపై అనూహ్యంగా ఆశ్చర్యపరిచే కథనాన్ని అందించిన సూర్య పత్రిక యాజమాన్యానికి, రచయి-ంత వివి రావు గారికి ధన్యవాదాలు. ఈ తరహా మరిన్ని వ్యాసాలు ప్రచురించాలని కోరుకుంటున్నాం. ప్రచురించిన ఎడిటర్, యాజమాన్యాలకు ధన్యవా దాలు. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**- వారాంతపు రజనీ, వరంగల్**
**-బి మధుశేఖర్, హైదరాబాద్**




**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రా లలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుణుల పనితీరును అర్థవంతంగా వివరి స్తున్న విశ్లేషకు లకు ధన్యావాదా లు. ప్రధానంగా థియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**- ముక్కామలపద్మావతి, హైదరాబాద్**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుం ది. అలాగే ధారావాహిక మెచ్చు కోలు గా ఉంది. రచిత కథనా న్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచ నలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**-శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

## అమ్మో గొడ్డలి ( ఓ చెట్టు విలాపం)



పట్టణం అంటే మోజుపడ్డాను
వీధి వీధిన వెలసి
నీడనిద్దామనుకున్నా అందరికీ
ఎవరు నీరు పోసినా పోయకున్నా
వరుణదేవుని కరుణతో పెరిగాను
నేలమ్మ నా ఆసరా
చిగుర్లు వేస్తూ రెమ్మ కొమ్మలను
పెంచుకుంటూ
పూలు పూస్తూ నేలమ్మ కొప్పులో
రోజూ పూలు
మురిసి సంతోషించేదాన్ని
మొదలు దృఢంగా విస్తరించుకుంటూ
సౌధాలకు పోటీగా ఎదుగాలని
ఆశ పడటం తప్పా చెప్పండి


ఎప్పుడో చిన్నప్పటి మాట
నాకు రక్షణగా ఇనుప కంచె ఒకటి
ఉంచారు
మన మున్సిపాలిటోల్లు
అది ఇప్పటికీ అలానే ఉంది
నేను లావుగా ఎదగడానికి
ప్రతిబంధకమైంది
ఎవరూ పట్టించుకోరు


కాస్త ఏపుగా ఎదగంగానే
నపై కర్కశంగా గొడ్డలి వేటు వేస్తారు
పక్షి రెక్కలు నరికితే ఎగరగలదా
చెప్పండి
కొమ్మలన్నీ నరికి వేస్తే నాలోని వేదన
ఎవరికి చెప్పుకోను
విద్యుత్ తీగలకు నేను
ప్రతిబంధకమట
విద్యుత్ తీగలు నేలమ్మ వడిలో
గొట్టాల ద్వార వేయొచ్చుకదా!
పచ్చదనం అంటారు
రోడ్ల కిరువైపులా మమ్మల్ని
నాటుతారు

మా నెత్తిన ఈ కరెంటు తీగలు
వేస్తారు
మేధావులారా ఆలోచించండి
మీకు ప్రాణవాయువునిచ్చి
కాపాడుతాము
మీరువదలిన విషవాయువుతో
మేము మనుగడ సాగిస్తాం
అమెరికా లాంటి దేశంలో ఎంచక్క
మా నేస్తాలకు ఇటువంటి కష్టాలు
లేవంట
మాకు అమెరికా పోవాలని ఉన్నా
మిమ్మల్ని రక్షించుకోవాల కదా!
అని మిన్నకున్నాం
కనికరించరా ఓ పాలకులారా!

**డా వి.డి.రాజగోపాల్**
**9505690690,9966900045**

## ఫన్ చెక్







నారు

సూర్య బుడత

బాలల కథ

# ఇద్దరు పిల్లలు - కొంటెవాడు



రాము, సోము కవల పిల్లలు. ఇద్దరూ ఐదవతరగతి చదువుతున్నారు. “మేముఅంగడి కెళ్తున్నాము .ఇంకొక అర్ధగంట లేకుంటే గంటలోపున తిరిగి వస్తాము .అంతవరకూ గొడవ చెయ్యకుండా ఆడుకొంటూ వుండండి “ అంటూ తల్లి తండ్రులు వెళ్లారు.

ఆ రోజు తల్లి తండ్రులు అంగడి కెళుతూ స్మార్ట్ ఫోన్ తీసుకెళ్లడం మరచిపోయి ఇంటిలోనే ఉంచడం గుర్తించారు. తల్లి తండ్రులు వున్నప్పుడు చదువు ,ఆరోగ్యం దెబ్బతింటుందని వీడియో గేమ్స్ ఆడటానికి అనుమతించరు. వారంలో ఒక్క అర్ధగంట మాత్రమే వీడియో గేమ్స్ ఆడుకొనడానికి అంగీకరిస్తారు.

స్మార్ట్ ఫోన్ చూడగానే ఇద్దరికీ సంతోషం అయింది .వీడియో గేమ్స్ చూడాలనుకొని ఇద్దరూ ఉబలాటపడ్డారు.

ఇద్దరూ ‘నేను ముందు ఆడాలి’ ‘నేను ముందు’ అని కొట్టుకొన సాగారు.

అదే వీధిలోనున్న వామనరావు ఇంటిలోనికి వచ్చి ఆడుకొనడానికి రమ్మని పిలవడానికి వచ్చాడు ,వామనరావు ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. ఇంటిలో రాము సోము కొట్లాడుకోవడం చూసాడు. కారణం అడిగి తెలుసుకొన్నాడు.

“ మీ గొడవ నేను తీరుస్తాను .ఆ సెల్ ఫోన్ నాకివ్వండి “అన్నాడు వామనరావు

“అన్నా మా సెల్ ఫోను తీసుకొని ఏం చేస్తావు ,మాలో ఎవరికి ముందు ఇవ్వాలని ఎలా చెబుతావు “అడిగాడు రాము

మీరు చిన్న పిల్లలు మీకు వీడియో గేమ్స్ తప్ప మీకేమి తెలీదు .గూగుల్ నందు అడిగితే సమాధానం చెబుతుంది” అంటూ గొప్పగా చెప్పాడు .

“మా అమ్మా నాన్నలు తొందరలో వస్తారు .ఈలోగా మొదట ఎవరు వీడియో గేమ్స్ ఆడాలో చెప్పండి అన్నా “ అన్నాడు సోము

స్మార్ట్ ఫోన్ తీసుకొని వాళ్లకు దూరంగా వెళ్లి వీడియో గేమ్స్ చూడసాగాడు వామన రావు .ఇద్దరూ ఏం సమాధానం చెబుతాడా అని వామనరావు వైపు చూడసాగారు


కాలింగ్ శబ్దం వినగానే “మా అమ్మా నాన్నలు వచ్చారు .” బుంగమూతి పెట్టుకొంటూ అన్నాడు రాము.


“గూగుల్ ఎందుకో సమాధానం చెప్పడానికి ఆలస్యం చేస్తూంది “అంటూ సెల్ ఫోన్ తిరిగి ఇచ్చాడు.


పిల్లలిద్దరూ సెల్ ఫోన్ ఆఫ్ చేసి టేబుల్ మీద ఉంచిన తరువాత తలుపులు తెరిచారు


‘మా ఇంటిలోనూ వీడియో గేమ్స్ ఆడుకొనడానికి సెల్ ఫోన్ ఇవ్వరు ,వీళ్లిద్దరి గొడవ పుణ్యమాని చూసాను ‘అని అనుకొంటూ సంతోషంతో వెళ్ళాడు వామనరావు .


**ఓట్ర ప్రకాష్ రావు**
**09787446026**





# తెలుగునేల మీద నారసింహ క్షేత్రాలివే..!



**తన భక్తుడైన ప్రహ్లాదుని కాపాడేందుకు శ్రీమహావిష్ణువు ఈ భూమ్మీద నరసింహావతారంలో ఆవిర్భవించాడు. మనిషి, సింహం రూపాల కలయికగా కనిపించే నారసింహుడు చూసేందుకు భీతిగొలిపేలా ఉన్నా.. తన భక్తుల పాలిటి ఆర్తజన రక్షకుడు. ఇటు.. తెలుగువారికి శ్రీ వేంకటేశ్వరుడితో బాటు నారసింహుడూ ప్రధాన కులదైవంగా ఉన్నాడు. ఈ తెలుగునేల మీద ఆయన 9 ప్రధానక్షేత్రాల్లో కొలువుదీరి భక్తుల పాలిట కొంగుబంగారంగా పూజలందుకుంటున్నాడు. అవే నవ నారసింహ క్షేత్రాలుగా పేరొందాయి. ఆ క్షేత్రాల వివరాలు..**

**మంగళగిరి:**
కృష్ణా నదీ తీరాన గుంటూరుకు సమీపంలోని మంగళగిరిలో నారసింహుడు.. కొండపై సుదర్శన నారసింహుడిగా, కొండకింద లక్ష్మీ నారసింహుడిగా దర్శనమిస్తాడు. కొండమీది చిన్న ఆలయంలో నోరు తెరచి కనిపించే నారసింహుడు.. భక్తులు అర్పించే పానకాన్ని స్వీకరిస్తాడు. ఈ పానకాల నరసింహుడు.. భక్తులు తన నోట్లో పోసిన పానకాన్ని స్వీకరించి, సరిగ్గా అందులో సగం తిరిగి నోటి నుంచి వదులుతాడు. రోజంతా భక్తులు పానకం పోస్తున్నా.. ఆ ఆలయంలో చిన్న ఈగ, దోమ, చీమ కనిపించవు. ఇక.. కొండ కింది కోవెలలో స్వామి లక్ష్మీనరసింహుడిగా దర్శనమిస్తాడు. అమరావతి పాలకుడు రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు ఇక్కడ కట్టించిన 157 అడుగుల ఎత్తైన, 11 అంతస్తుల గాలిగోపురం.. రాష్ట్రంలోనే ఎత్తైనదిగా పేరొందింది.

**మాల్యాద్రి:**
పూర్వం అగస్త్య మహాముని ఇక్కడ చేసిన తపస్సుకు మెచ్చి విష్ణువు.. నరసింహావతారంలో కొలువైన క్షేత్రమిది. జ్వాలా రూపంలో దర్శనమిచ్చిన స్వామిని.. అగస్త్యుడు ఇక్కడే ఉండి, వారంలో ఒకరోజు మానవులకు దర్శనమివ్వాలని కోరగా.. స్వామి ఇక్కడ కొలువయ్యాడని స్థల పురాణం చెబుతోంది. ఇక్కడి కొండ పూలదండ(మాల) రూపంలో ఉన్నందున దీనిని మాల్యాద్రి, మాలకొండ అంటారు. ఇక్కడి లక్ష్మీ నరసింహుడు కేవలం శనివారం రోజునే భక్తులకు దర్శనమిస్తాడు. ప్రకాశం జిల్లాలోని కందుకూరు నుంచి పామూరు వెళ్లే దారిలోని వలేటివారి పాలెం గ్రామంలోని ఆలయాన్ని వారంలోని అన్ని రోజులూ తెరిచేందుకు భక్తులు గతంలో ప్రయత్నించగా పలు సమస్యలు ఎదురవటంతో కేవలం శనివారమే ఈ ఆలయాన్ని తెరుస్తారు. శనివారం ఉదయం అభిషేకంతో మొదలయ్యే సేవలు.. సూర్యాస్తమయ వేళకు ముగుస్తాయి. మాలకొండయ్య, మాలకొండమ్మ, మాల్యాద్రి అనే పేర్లు ఈయన పేరు మీద వచ్చినవే.

**అంతర్వేది:**
హిరణ్యాక్షుడి కుమారుడైన రక్తావలోచనుని సంహారానంతరం వశిష్ఠుడి కోరికమేరకు విష్ణుమూర్తి ఇక్కడ లక్ష్మీనృసింహ స్వామిగా వెలిశాడనేది పురాణగాథ. వశిష్ఠమహర్షి ఇక్కడ యాగం చేసినందువల్లే దీనికి అంతర్వేది అనే పేరు వచ్చిం దట. ఇది మహిమాన్విత క్షేత్రంగా వెలుగొందుతోంది. త్రేతాయుగంలో రావణబ్రహ్మను సంహరించిన శ్రీరాముడు బ్రహ్మహత్యాపాతకం నుంచి విముక్తిని పొందడానికి ఈ క్షేత్రాన్ని దర్శించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడి విగ్రహాలను బట్టి క్రీ.శ. 300కు ముందు నిర్మించినట్లు తెలుస్తోంది. ఆ తరవాత ఒడలరేవు గ్రామస్తులు దీన్ని పునరుద్ధరించారు. మాఘమాసంలో స్వామివారి కల్యాణోత్సవాలు కన్నులపండుగగా జరుగుతాయి.

**ధర్మపురి:**
హిరణ్యకశిపుడి సంహారం తర్వాత నరసింహ స్వామి ఈ పావన గోదావరీ తీరాన తపస్సు చేసిన క్షేత్రమే ధర్మపురి. ధర్మవర్మ అనే రాజు కోరిక మీదట స్వామి ఇక్కడ కొలువయ్యాడనీ, అందుకే దీనికి ధర్మపురి అనే పేరువచ్చిందని చెబుతారు. ఆంజనేయుడు క్షేత్రపాలకుడిగా ఉండే ఈ క్షేత్రంలో యమధర్మరాజు నారసింహుడిని సేవించుకుని, ఇక్కడే స్థిర నివాసం ఏర్పరచుకున్నాడని స్థల పురాణం చెబుతోంది. అందుకే ఇక్కడికొచ్చే భక్తులు ముందుగా ఆలయ ప్రాంగణంలోని యమధర్మరాజు ఆలయాన్ని దర్శించుకున్నాకే.. ప్రధాన ఆలయంలోని నరసింహస్వామిని దర్శించుకుంటారు. 'ధర్మపురికి పోయినవాడికి యమపురికి పోయే అవసరమే రాదు' అనే నానుడి ఇందుకే పుట్టింది. కరీంనగర్ పట్టణానికి 80 కి.మీ దూరంలో ఈ క్షేత్రం ఉంది.

**పెంచలకోన:**
హిరణ్యకశిపుడి సంహారం తర్వాత భీకర రూపంతో స్వామి ఇక్కడి కొండకోనల్లో తిరుగాడుతున్న వేళ.. ఈ అటవీ ప్రాంతంలోని చెంచులంతా ఆయనను చూసి ప్రాణభయంతో చెల్లాచెదురైపోయారట. కానీ.. ఆ చెంచుల రాజు కుమార్తె చెంచులక్ష్మి మాత్రం.. స్వామిని చూసి భయపడకుండా అలాగే నిలిచి ఆయనకు నమస్కరించి శాంతించమని ప్రార్థించిందట. ఆమె ధైర్యానికి, భక్తికి మెచ్చిన స్వామి ప్రసన్నుడు కాగా.. చెంచులక్ష్మి ఆయనకు సేవలు చేసిందనీ, ఆమెను వివాహమాడాలని భావించిన స్వామి.. చెంచురాజుకు కొంత ధనం సమర్పించి ఆమెను వివాహమాడి, ఆమెను పెనవేసుకుని శిలారూపంలో ఈ పెంచలకోన మీద ఉండిపోయాడని స్థలపురాణం చెబుతుంది. నెల్లూరు జిల్లా రాపూరు మండలంలో ఉంది. పెంచలయ్య, పెంచలమ్మ, పెంచల నాయుడు, పెంచల రెడ్డి అనే పేర్లు ఈ స్వామి పేరిట వచ్చినవే.

**వేదాద్రి:**
కృష్ణానదీ తీరాన చిల్లకల్లు గ్రామానికి 10 కి.మీ దూరాన ఈ క్షేత్రం ఉంది. సోమకాసురుడు అనే అసురుడు బ్రహ్మ చేతిలోని వేదాలను కాజేసి సముద్రంలో దాక్కోవటంతో విష్ణువు చేప (మత్స్యం) రూపంలో ఆ రాక్షసుడిని సంహరించి, వేదాలను తిరిగి బ్రహ్మకు అప్పగించాడు. ఆ సమయంలో వేదాలు.. స్వామిని సేవించుకునే అవకాశం ఇవ్వమని కోరగా, హిరణ్యకశిపుడి సంహారం తర్వాత కృష్ణా తీరంలో కొలువుదీ-రతానని స్వామి వాటికి వరమిచ్చాడనీ, అందుకే ఇక్కడ వెలిశాడనీ చెబుతారు. ఈ క్షేత్రంలో స్వామి.. జ్వాల, సాలగ్రామ, యోగానంద, లక్ష్మీనరసింహ, వీర నరసింహుడనే 5 రూపాల్లో దర్శనమిస్తాడు.

**అహోబిలం:**
తన భక్తుడైన ప్రహ్లాదుడిని కాపాడేందుకు స్వామి ప్రళయ భీకరమైన రూపంతో వచ్చి.. తన గోళ్లతో రాక్షస సంహారం చేసి ఆ ప్రాంతమంతా భీకరమైన అరుపులతో తిరుగుతూ ఇక్కడి బిలంలో కొలువయ్యాడు. దీనిని చూసిన దేవతలు 'అహోవీరా.. అహో సూరా.. అహో బహుపరాక్రమా.. ఆహోబిలః ఆహోబిలః' అని స్తుతించారు. కర్నూల్ జిల్లా ఆళ్లగడ్డకు 25 కి.మీ. దూరంలో ఉంది. స్వామి ఆవిర్భవించిన స్తంభాన్నీ మనం ఇక్కడ చూడవచ్చు. జ్వాలా, అహోబిల, మాలోల, వరాహ, కారంజ, భార్గవ, యోగానంద, ఛత్రవట, పావన నారసింహ రూపాల్లో స్వామి ఇక్కడ దర్శనమిస్తాడు.

**యాదాద్రి:**
పూర్వం ఋష్యశృంగుడనే మహాముని కుమారుడైన యాదుడు ఈ కొండమీద నారసింహుడి దర్శనం కోసం తపస్సు చేయగా.. స్వామి ఉగ్రరూపంలో దర్శనమిచ్చాడట. కానీ.. ఆయన భీకర రూపాన్ని చూడలేకపోయిన యాదుడు.. శాంతరూపంలో ఇక్కడ కొలువుండమని వేడుకొనగా, స్వామి లక్ష్మీసమేతుడై కొండపై కొలువుదీరాడట. స్వామిని సేవిస్తున్న యాదుడు.. మరొకసారి స్వామిని పలు రూపాల్లో చూడాలని కోరగా, ఆయన కోరిక మేరకు స్వామి.. జ్వాలా, యోగానంద, గండ భేరుండ, ఉగ్రనారసింహ రూపాల్లో కనిపించాడు. యాదగిరీశుడి దర్శనంతో సకల రోగాలూ నశించి, మంచి ఆరోగ్యం సమకూరుతుందని భక్తుల విశ్వాసం. హైదరాబాద్‌కు 70 కి.మీ దూరంలో ఈ క్షేత్రం ఉంది.

**సింహాచలం:**
తూర్పు కనుమల్లో సింహగిరి మీద గల క్షేత్రమే సింహాచలం. సాక్షాత్తూ ప్రహ్లాదుడి చేత ఈ స్వామి పూజలందుకున్నాడని, అనంతర కాలంలో పురూరవుడు అనే చక్రవర్తి.. పుష్పక విమానంలో వెళుతుండగా, పుట్టలోని స్వామి మూర్తి ఆకర్షించటంతో ఆకాశంలోని పుష్పక విమానం నేల మీదికి వచ్చిందని, తనను ప్రతిష్ఠించి చందనం పూయమని, ఏటా వైశాఖ శుద్ధ తదియ నాడు నిజరూప దర్శనం కల్పించాలని స్వామి పూరూరవుడిని ఆదేశించినట్లు స్థల పురాణం చెబుతోంది. నాటి నుంచి ఏటా ఇక్కడ చందనోత్సవం జరుపుతున్నారు. ఇక్కడ స్వామి వరాహ, సింహ, మానవ రూపాల కలయికగా దర్శనమిస్తాడు. విశాఖ పట్టణానికి సమీపంలోని ఈ కోవెల సముద్ర మట్టానికి 800 అడుగుల ఎత్తున ఉంది. ఇక్కడ స్వామి పశ్చిమ దిశగా కూర్చొని దర్శనమిస్తాడు. 11వ శతాబ్దంలో గజపతులు ఈ ఆలయాన్ని నిర్మించారు. దంపతులు ఆలయంలోని కప్పస్తంభాన్ని కౌగిలించుకుంటే.. వారి కోరికలు తీరతాయని ప్రతీతి. ఈ స్వామిని ఉత్తరాంధ్ర భక్తులు 'అప్పన్న' అని పిలుచుకుంటారు.

# గ్రామదేవతల పేర్లు - విశేషాలు

మనం రకరకాల పేర్లతో పిలిచే ప్రతి గ్రామదేవత పేరు వెనుక ఒక పరమార్థం ఉంది.

1. ఊరిని విడిచి పొరుగూరు వెళ్ళే వ్యక్తుల రాకపోకల్ని గమనిస్తూ వూరి పొలిమేరలో వుండేతల్లి "పొలిమేరమ్మ" క్రమముగా "పోలేరమ్మ" అయింది.

2. 'ఎల్ల' అంటే సరిహద్దు అని అర్ధము. అందుకే 'ఎల్లమ్మ' కూడా ఈ పనిని చేసేదన్నమాట.

3. ఒక వ్యక్తికి జీవన భృతి కలిగించి పోషించే తల్లి 'పోచం అమ్మొాపోచమ్మ' అన్నమాట. ఎల్లమ్మ తల్లి తన భక్తులకి ఎటువంటి వ్యాధులు రాకుండా నివారించేదైతే, 'పోచమ్మ' పోషణ కలిగిస్తుంది.

4. ప్రతి వ్యక్తికీ ఇంతకాలము జీవించాలనే ఓ కట్ట (అవధి) ఏదుందో ఆ కట్టని మేయగల (ఆ అవధినించి రక్షించగల) అమ్మే 'కట్టమేయం అమ్మొాకట్టమేసేయమ్మ - కాలక్రమములో "కట్టమైసమ్మ" అయింది.

5. స్వచ్ఛమైన అమ్మ అనే అర్ధములో అచ్చ (స్వచ్ఛమని) సుంఅచ్చొాస్వచ్ఛ అనే రెండు పదాలు కలిపి "అచ్చమ్మ" గా అయ్యింది.

6. సాధారణముగా 15 వూళ్ళకో దేవత వుంటుంది. 'మా వూళ్ళన్నింటికీ అమ్మ' అనే అర్ధములో ఆమెను "మావూళ్ళమ్మ" అని పిలుస్తూంటే క్రమముగా అది "మావుళ్ళమ్మ" అయింది.

7. ప్రజల మనసులో పుట్టి ఏ కోర్కె ఏదైనా అది మంచిదో కాదో తానే నిర్ణయించి కోరిన కోర్కెని తీర్చే బాధ్యతని స్వీకరంచి భక్తులకు అండగా నిలిచే తల్లి "తలుపులమ్మ". 'తలపు' అంటే ఆలోచన. ఆ తలపులను తీర్చే తల్లి "తలపులమ్మ" క్రమముగా ఈమె "తలుపులమ్మ" గా మారింది. ఇంట్లో నుండి బయటికి వెళ్ళేటపుడు తల్లికి లేదా భార్యకి ఎలా చెప్తామో అలాగే ఆ తల్లిని ప్రార్థించి వెళ్ళడం చేస్తారు.

8. శంకరునితో కలసి అర్దనారీశ్వర రూపముతో అమ్మవారుండేది.



ఆకారణముగా శంకరుని మెడమీద (గళము) మచ్చ (అంకం) కారణముగా "అంకగళమ్మ", "అంకాళమ్మ" గా మారిపోయింది.

9. పొలిమేరలో వుండే మరొక తల్లి "శీతలాంబ". ఈమె చేతుల్లో చీపురు, చేట ఉంటాయి. తన గ్రామములోని ప్రజలకు వ్యాదులను కలిగించే క్రిమి కీటకాలని, భయాన్ని కలిగించే భూత ప్రేత పిచాచ గణాలను గ్రామములోనికి రాకుండా వూడ్చి చేటలోకి ఎత్తి పారబోసేది ఈదేవతే.

10. పాములు బాగా సంచరించే చోటులో వుండే దేవత తల్లి "పుట్టమ్మ". ఈమె గుడిలో అనేక పుట్టలుంటాయి. అక్కడే సుబ్రహ్మణ్య షష్టికి అందరూ పుట్టలో పాలు పోస్తారు. ఈ తల్లికే "నాగేశ్వరమ్మ" అని కూడా అంటారు. పాప (అంటే పాము)ంఅమ్మొాపాపమ్మ అవుతుంది కాబట్టి ఈ తల్లికి "పాపమ్మ" అని కూడా అంటారు. సుబ్రహ్మణ్యేశ్వరుడు పేరుమీదే "సుబ్బంఅమ్మొా "సుబ్బమ్మ" కూడా దైవముగా ఉంది.

11. బతుకుకి కావలసిన వర్షాన్ని పంటలనూ ఇచ్చే తల్లి "బతుకమ్మ".

12. గ్రామప్రజల మంచిని చూసే (కనే) అమ్మ "కన్నమ్మ"గా ఎప్పుడూ సత్యాన్ని (నిదర్శనాలని) చూస్తూవుండే తల్లి సత్యంఅమ్మొా "సత్తెమ్మ".

13. అలాగే పుల్ల (వికసించిన కళ్ళున్న) అమ్మ "పుల్లమ్మ". ప్రతి విషయాన్ని ఎంతో శ్రద్ధగా పరిశీలించి చూస్తుంది కాబట్టి ఆమె పుల్లమ్మ అయ్యింది.

14. ఇక ప్రతి శుభకార్యానికి నైవేద్యాన్ని అర్పించుకొనే చోటవున్న తల్లి అర్పణంఅమ్మొా "అర్పణలమ్మ" క్రమముగా "అప్పలమ్మ" అయినది.

15. బెల్లము బాగా వున్న ప్రాంతాలలో ఈ తల్లికి అప్పాలు బాగా ఇష్టమంటూ భావించే భక్తులు అప్పాలంఅమ్మొా "అప్పలమ్మ" అన్నారు.

16. అమ్మవార్ల వూరేగింపులో అన్నిటికన్న చిన్నది బాలా త్రిపుర సుందరి విగ్రహానికి సమమైన వుజ్జీ అయినదీ పెంటి (బాల)ంఅమ్మొా "పెంటమ్మ".

17. భోజనాన్ని అందించగల తల్లి అనే అర్థములో బోనముల (భోజనమనే పదానికి వికృతి)ంఅమ్మొా "బోనాలమ్మ".

18. అయ్య అయిన శంకరునికి అమ్మ (భార్య) కాబట్టి ఈమెను "అయ్యమ్మ" ని కొన్ని చోట్ల పిలుస్తారు.

19. లలితాంబ భండాసురుణ్ణి చంపేందుకు గుర్రాలమీద కూర్చొన్న స్త్రీ సైనికుల సైన్యముతో వెళ్ళినది కాబట్టి గుర్రాలంఅమ్మొా "గుర్రాలమ్మ" అయినది.

20. ఊరు పేరుని బట్టి పిల్చుకొనే దేవతలు కొందరున్నారు. సోమప్రోలుంఅంబొా"సోమపోలమాంబ" అన్నారు. సోమప్రోలు అనే గ్రామము ఉత్తరాంధ్ర శ్రీకాకుళం జిల్లాలోని సోంపేట.

21. సీతాదేవి వనవాసం చేసిన సమయంలో గౌతమీ నదిలో స్నానం చేసి వనదేవతలను పూజించగా ఆమె ప్రత్యక్షమైనదని అప్పటినుంచి కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పూజలు అందుకుంటుందని ప్రసిద్ధికెక్కిన తల్లి తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట మండలంలోని వానపల్లి అనే గ్రామంలో ఉన్న "పళ్ళాలమ్మ" "పళ్లమాంబిక". ఇక్కడ వెలసిన అమ్మవారిని ఈ గ్రామస్తులు కాళికా దేవి అవతారంగా భావించి పూజిస్తారు. ఈ ఆలయంలో అమ్మవారు కాలుపై కాలు వేసుకుని భక్తులకు దర్శనమిస్తారు. ఈ అమ్మవారి పాదాల కింద నక్కను తొక్కి ఉండటం విశేషం. ఆంధ్రప్రదేశ్ లోని పలు గ్రామాలలో ఈ అమ్మవారి విగ్రహం ఉండడం విశేషం.

# వెన్నునొప్పిని దూరం చేసే మూడు సింపుల్ వ్యాయామాలు



ఈ రోజుల్లో వెన్నునొప్పి అనేది సాధారణ సమస్యగా మారింది. ఇది రావడానికి వివిధ కారణాలు ఉన్నాయి. వ్యాయామం లేకపోవడం, ఆఫీస్లో కూర్చోని చేసే ఉద్యోగాలు, పేలవమైన భంగిమ తీవ్రమైన వెన్నునొప్పికి కారణమవుతాయి. దీనికి చికిత్స చేయించుకోకపోతే అనేక సమస్యలకు దారితీస్తుంది. అంతేకాకుండా మీ భంగిమను పూర్తిగా ప్రభావితం చేస్తుంది. ఈ సమస్య ఉంటే కూర్చోవడం, పడుకోవడం, నడవడం, వంగడం వంటి రోజువారీ పనులు చేయడం కూడా కష్టతరం అవుతుంది.

వెన్నునొప్పి తీవ్రం కాకుండా ఉండాలంటే.. దానికి వెంటనే చికిత్స చేయించుకోవాలి. నొప్పి రావడానికి గల కారణాలను గుర్తించి.. సమస్యను తగ్గించుకోవచ్చు. కొందరు ఈ సమస్యను దూరం చేసుకోవడానికి ఆస్టియో ప్రెజర్ను ట్రీట్మెంట్స్ కూడా ఫాలో అవుతున్నారు. దీని ప్రకారం నిర్దిష్టమైన పాయింట్లు నొక్కినప్పుడు లేదా ప్రత్యేకమైన స్ట్రెచ్ చేసినప్పుడు ఈ సమస్య తగ్గుతుంది. కొన్ని సందర్భాల్లో మందులు వాడాల్సిన అవసరం కానీ.. శస్త్రచికిత్స్ చేయించుకోవాల్సిన అవసరం కూడా ఉండదు. కొన్ని వ్యాయామాలతో కూడా ఈ సమస్యను దూరం చేసుకోవచ్చు. ఇంతకీ ఆ వ్యాయామాలు ఏమిటో.. వాటిని ఎలా చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

థొరాసిక్ స్ట్రెచ్

ఫోమ్ రోలర్ తీసుకోండి. అనంతరం నేలపై కూర్చోండి. ఫోమ్ రోలర్ను వెనుక భాగంలో ఉంచి.. దానిపై పడుకోండి. మెల్లిగా కాళ్లను చాచి.. మెడ, తల నేలపై ఉండేలా చూసుకోండి. ఫోమ్ రోలర్ కరెక్టా ఉందో లేదో మరోసారి చెక్ చేసుకోండి. అది కరెక్టా ఉంటే మీకు కాస్త నొప్పి ఉంటుంది. ఇప్పుడు డీప్ బ్రీత్ తీసుకోండి. ఇప్పుడు శరీర పైభాగాన్ని కొద్దిగా ముందుకు వెనుకకు తరలించండి. ఈ స్ట్రెచ్ రెండు నిమిషాలు చేయవచ్చు. ఇది మీ వెనుక కండరాలను సాగదీసి.. నొప్పిని తగ్గిస్తుంది.

ఓపెనింగ్ చెస్ట్

రెండు కుర్చీలను మీకు రెండువైపులా.. చేతులు అందుకోగలిగేంత దూరంలో ఉంచండి. వాటి మధ్య మోకాళ్లు వేసి కూర్చోండి. ఇప్పుడు మీ రెండు చేతులను విస్తరించి.. 90 డిగ్రీల కోణంలో ఉండేలా కూర్చీలపై చేతులు ఉంచండి. ఈ చేతులను కాస్త పైకి లేపి.. పది డిగ్రీలు ముందుకు వంగండి. ఊపిరి పీల్చుకుంటూ కిందకి వంగాలి. యథాస్థానంలోకి వచ్చేప్పుడు ఊపిరి వదలాలి. ఇలా చేస్తే ఛాతీలో ఉండే నొప్పి తగ్గుతుంది. రెండు నిమిషాలు ఈ వ్యాయామం చేయడం వల్ల పెక్టోరల్ కండరాలు విస్తరిస్తాయి. ఈ వ్యాయామాన్ని మీరు నిల్చోని కూడా చేయవచ్చు. రూమ్ కార్నర్కి వెళ్లి చేతులను గోడకు ఆనించి.. ఇదే తరహాలో వ్యాయామం చేయాలి.

డయా ఫ్రాగమ్ స్ట్రెచ్

ఓ కూర్చీపై నిటారుగా కూర్చోండి. డీప్ బ్రీత్ తీసుకుని వదలండి. ఈ సమయంలో మీరు ఎగువ శరీరం ముందుకు వంగండాన్ని మీరు గమనించవచ్చు. మరోసారి గాలిని తీసుకుని.. వీలైనంత గట్టిగా దానిని వదలండి. ఊపిరితిత్తుల్లోని గాలి మొత్తాన్ని బలవంతంగా బయటకు వదలండి. ఇప్పుడు మీ శరీరాన్ని మీ కాళ్ల మధ్య తీసుకెళ్లండి. ఇప్పుడు నోటిని, ముక్కును మూసేయండి. ఇవి మీ శరీరాన్ని వెనుకకు తీసుకురండి. మీ ఊపిరితిత్తులలో ఆక్సిజన్ లేదనే ఫీలింగ్ వచ్చే వరకు శ్వాస తీసుకోకుండా ఉండేందుకు ప్రయత్నించండి. ఇప్పుడు మెల్లిగా గాలితీసుకోండి. దీనిని మీరు ఎన్నిసార్లు ట్రై చేసినా పర్లేదు. ఎందుకంటే ఇలా చేయడం వల్ల వెన్నునొప్పి దూరం కావడంతో పాటు.. ఊపిరితిత్తులు కూడా హెల్తీగా మారుతాయి.

ఈ వ్యాయామాలు మీకు ప్రస్తుతమున్న నొప్పిని దూరం చేయడమే కాకుండా.. భవిష్యత్తులో మ-రోసారి అసౌకర్యానికి గురికాకుండా చేస్తాయి. కాబట్టి వీటిని మీ రెగ్యూలర్ రోటీన్లో భాగం చేయండి.

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com
SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.



# రష్యన్ ఆర్మీకి మద్దతుగా భారతీయుడు

## డ్రోన్ దాడిలో మృతి...

## అంతుచిక్కని తెలంగాణ యువకుల ఆచూకీ

**సొంత ఊర్లో ఉంటూ... కుటుంబ సభ్యులందరితో కలిసి కష్టసుఖాలను పంచుకుంటూ... బంధాలను.. అనుబంధాలను కాపాడుకుంటూ జీవితాన్ని గడపాల్సిన యువత అత్యాసలకు పోతోంది. నేటి యువత వారి జీవితాన్ని తమకు నచ్చినట్లుగా...ఇష్టమైన మార్గాలను ఎన్నుకోవడం మంచిదే. కానీ ఆ మార్గాలు సక్రమమైతేనే తగిన ఫలితం లభిస్తుంది. లేదంటే అది ప్రాణాలమీదకు తెచ్చుకోవడమే. స్వదేశంలో బ్రతకడానికి ఉన్న మార్గాలను పక్కకుపెట్టి... పక్కింటి పుల్లకూర రుచి అన్న చందాన ఇతర దేశాలకు బ్రోకర్ల సహాయంతో ప్రయాణమైతే... ఆ ప్రయాణం...ప్రాణాల మీదికి తెస్తున్న గత అనుభవానలు కూడా యువత తెలుసుకోవాలి. అనాలోచితంగా వేసే అడుగులతో ఎదురయ్యే దుష్పరిణామాలు కన్నతల్లితండ్రులు, తోబుట్టువులే కాదు వారి రక్తసంబంధీకులు కూడా జీవితకాలం రోధించాల్సిన దుస్థితి కలుగుతోంది. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకోవడం అన్నట్లు నేటి యువతీ యువకుల ఆలోచనారీతి ఉండటం ఎంతో దురదృష్టకరం... బాధాకరం. ఇటీవల మన దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన యువత రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య జరిగిన యుద్ధంలో అనధికారికంగా పాల్గొనడంతో వారి ప్రాణాలు పోగొట్టుకున్నారు. అసలు ఆ యువకులు ఎలా రష్యా సైన్యంలో ఎలా చేరారు.. వారి లక్ష్యం ఏమిటి..? వారు సాధించిందేమిటి..? ఇవన్నీ మన ముందున్న సమాధానాలు లేని ప్రశ్నలే.**

రష్యా వెళ్లి లక్షల రూపాయలు సంపాదించుకోవచ్చని అత్యాశకు పోయి ప్రాణాలు పోగొట్టుకున్నడో యువకుడు. అతనే కాదు.. చాలామంది భారతీయ యువకులు రష్యా ఆర్మీకి మద్దతుగా అనధికారికంగా సైన్యంలో చేరినట్లు వార్తలందాయి. ఇటీవల ఒకరు ప్రాణాలు కోల్పోయారు. రష్యా తరఫున యుక్రెయిన్‌తో యుద్ధంలో పాల్గొన్న గుజరాత్‌కు చెందిన హేమిల్ అశ్విన్ భాయ్ (23) డ్రోన్ దాడిలో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు దుబయి కేంద్రంగా ఇలాం టి నియామకాలకు సహకరించిన ఏజెంట్ ఫైజల్ ఖాన్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఇలా రష్యా సైన్యంతో కలిసి యుద్దంలో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువకులే కాకుండా, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర, జమ్ముకశ్మీర్ నుంచి 16 మంది రష్యాకు బయల్దేరి వెళ్లారు. అక్కడ యుక్రెయిన్‌తో వీరు యుద్ధం చేస్తున్నారు. ఏజెంట్లు చెప్పిన మాటలు నమ్మి వెళ్లి యుక్రెయిన్‌తో రష్యా చేస్తున్న యుద్ధంలో ఫ్రంట్‌లైన్ సైనికులుగా పోరాడుతున్నామని వీరిలో కొందరు చెబుతున్నారు. హెల్పర్ ఉద్యోగం పేరుతో పిలిచి ఆర్మీలో రిక్రూట్ చేసుకున్నారని పలువురు నెత్తీనోరూ కొట్టుకుంటున్నారు.

**హెల్పర్ ఉద్యోగాల పేరిట నమ్మించిన ఏజెంట్లు..**

భారతీయ యువకులకు విదేశాల్లో సెక్యూరిటీ, హెల్పర్ ఉద్యో గాలు ఇప్పిస్తామని చెప్పి తీసుకెళ్లారు ఏజెంట్లు. ఇందుకోసం రష్యాలో ఇద్దరు, ఇండియాలో ఇద్దరు ఏజంట్లు పనిచేస్తున్నారని కేంద్రం గుర్తించింది. ఈ నలుగురికీ సమన్వయకర్తగా దుబయిలో ఫైజల్ ఖాన్ అనే మరో ఏజెంట్ ఉన్నారు. ఈయన బాబా వ్లాగ్స్ పేరిట యూట్యూబ్ చానల్ కూడా నడుపుతున్నారు. రష్యాలో హెల్పర్ ఉద్యోగాలు ఉన్నాయని తన యూట్యూబ్ చానల్‌లో వీడియోలు పెట్టి యువతను ఆకర్షిస్తున్నాడు. ఆ వీడియోలు చూసి.. అందులో ఇచ్చిన ఫోన్ నంబర్ల ఆధారంగా ఉద్యోగాలు అవసరమైన యువకులు తయ ప్రయత్నాలు మరింత ముమ్మరం చేసేవారు. మొత్తం 35 మందిని రష్యా పంపించేందుకు ఏజెం ట్లు ప్రణాళిక సిద్ధం చేసుకొని, వారిలో మొదటి బ్యాచ్ లో ముగ్గురు 2023 నవంబరు 9న ఇండియా నుంచి బయల్దేరారు. చెన్నై నుంచి షార్జా.. అక్కడి నుంచి మాస్కోకు 12న చేరుకున్నారు. నవంబరు 16న ఆరుగురు, తర్వాత ఏడుగురిని ఫైజల్ ఖాన్ బృందం రష్యా తీసుకెళ్లింది . కొన్ని రోజుల పాటు ట్రైనింగ్ ఇచ్చి డిసెంబరు 24న ఆర్మీలో చేర్పించినట్లు బాధిత యువకుల కుటుంబీకులు వాపోతున్నారు. అయితే, తాను ఎక్కడా సెక్యూరిటీ, హెల్పర్ ఉద్యోగాలు మాత్రమే ఇప్పిస్తామని ఎక్కడా చెప్పలేదని దుబయిలోని ఏజెంట్ ఫైజల్ ఖాన్ ఇప్పుడు చెప్పడం గమనార్హం. "ఆర్మీ హెల్పర్ అని చెప్పాను. గతంలో నేను చేసిన వీడియోలు చూడొచ్చు. రష్యా అధికారుల నుంచి మాకు కూడా హెల్పర్ జాబ్ అనే సమాచారం ఉంది. నేను దాదాపు ఆరేడు సంవత్సరాల నుంచి ఈ పనిలో ఉన్నాను. ఇప్పటి వరకు దాదాపు రెండు వేల మందికి వేర్వేరు చోట్ల ప్లేస్‌మెంట్ ఇప్పించాను" అని చెప్పారు. రష్యాకు వెళ్లిన కొందరి పేర్లను ఒక జాతీయ మీడియా సంస్థ సంపాదించింది.ఇలా రష్యా వెళ్లిన వారిలో హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అఫ్సాన్, తెలంగాణ లోని నారాయణపేటకు చెందిన సుఫియాన్, యూపీకి చెందిన అర్బాన్ హుస్సేన్, కశ్మీర్ కు చెందిన జాహూర్ అహ్మద్, గుజరాత్ కు చెందిన హేమిల్, కర్ణాటకలోని గుల్బర్గాకు చెందిన సయ్యద్ ఇలియాస్ హుస్సేన్, సమీర్ అహ్మద్, అబ్దుల్ నయీం ఉన్నారు. వీరిలో గుజరాత్‌కు చెందిన 23 ఏళ్ల హేమిల్ యుద్ధభూమిలో మరణించారు. ఫిబ్రవరి 21న దోన్యస్క్ ప్రాంతంలో జరిగిన డ్రోన్ దాడిలో హేమిల్ మరణించినట్లు తనకు సమాచారం ఉందని ఏజెంట్ ఫైజల్ ఖాన్ వెల్లడించారు. కాగా అక్కడ యుద్ధం చేస్తున్న భారతీయులలో మరికొందరి ఆచూకీ కూడా కొద్దికాలంగా తెలియ లేదు. కొన్నివారాలు తమతో వారు కాంటాక్ట్‌లో లేరని కుటుంబీకులు వాపోతున్నారు. అసలు ఈ విషయం ఎలా బయటకు వచ్చిందంటే.. ఉద్యోగం కోసం వెళ్తున్నామంటూ బయల్దేరిన వారు కుటుంబ సభ్యులతో సంప్రదింపులు చేయకపోవడంతో పాటు రష్యాలోని యువకుల నుంచి బయటకు వచ్చిన వీడియో ల ఆధారంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

**"డ్రోన్ మాపైకి దూసుకొచ్చింది. దానిపై ఎదురు దాడి చేసేందుకు ప్రయత్నించాం. కానీ అది సాధ్యం కాలేదు. ఈ లోగా ఆ డ్రోన్ దాడి చేసింది. ఈ తీవ్రతకు హెమిల్ చనిపోయాడు. మరి కొందరు రష్యన్ సైనికులు గాయపడ్డారు. హెమిల్ డెడ్‌బాడీని నేనే ట్రక్‌లోకి ఎక్కించాను"**

**-- ప్రత్యక్ష సాక్షి**



**వైరల్‌గా మారిన ఆ రెండు వీడియోలు**

"మమ్మల్ని సెక్యూరిటీ హెల్పర్స్ ఉద్యోగం అని తీసుకువచ్చి రష్యా ఆర్మీలోకి తీసుకున్నారు. రష్యా బోర్డర్‌లోకి తీసుకువచ్చారు. ఇక్కడ అడవిలో యుద్ధభూమిలో ఉంచారు. మమ్మల్ని బాబా వ్లాగ్స్ ఏజెంట్ మోసం చేశారు." అని ఒక వీడియోలో కర్ణాటకలోని గుల్బర్గాకు చెందిన సయ్యద్ ఇలియాస్ హుస్సేన్, మహమ్మద్ సమీర్ అహ్మద్, సుఫియాన్

(మిగతా 8వ పేజీలో)

(7వ పేజీ తరువాయి)

మాట్లాడినట్లుగా ఉంది. మరో వీడియోలో ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన అర్బాజ్ హుస్సేన్ మాట్లాడినట్లుగా ఉంది. తన చేతికి గాయమైందని చూపించారు. యుద్ధభూమిలో తమను పడేశారని, అక్కడి నుంచి అతి కష్టం మీద తప్పించుకుని బయటకు వచ్చానని అందులో చెప్పారు. తమను ఎలాగైనా కాపాడాలని వేడుకుంటున్నారు.

### రష్యన్‌లో బాండ్ పేపర్‌పై సంతకాలు

రష్యాకు వెళ్లిన తర్వాత ట్రెనింగ్‌కు ముందుగా ఈ యువకులతో బాండ్ పేపర్‌పై సంతకాలు చేయించుకున్నారు అక్కడి అధికారులు. బాండ్ పేపర్ రష్యన్ భాషలో ఉందని, ఏజెంట్ల మీద నమ్మకంతో వాటిపై అందరూ సంతకాలు చేసినట్లు తెలంగాణ రాష్ట్రానికి చెందిన హైదరాబాద్ నగరంలోని నాంపల్లికి చెందిన మహమ్మద్ ఇమ్రాన్ చెప్పారు. ఇతని తమ్ముడు అఫ్సన్ కూడా రష్యాకు వెళ్లి మోసపోయిన వారిలో ఉన్నారు. మహమ్మద్ అఫ్సన్ ది హైదరాబాద్ నాంపల్లి. ఒక జాతీయ మీడియా సంస్థ ప్రతినిధులు అఫ్సన్ ఇంటికి వెళ్లినప్పుడు అక్కడ అతని అన్న మహమ్మద్ ఇమ్రాన్ కలిశారు. ఒక భవనంలోని మూడో అంతస్తులో వీరు నివాసం ఉంటున్నారు. అఫ్సన్‌కు భార్య, రెండేళ్ల బాబు, 8 నెలల పాప ఉన్నారు. గతంలో ఇతను హైదరాబాద్ లో ఒక బట్టల షాపులో క్లస్టర్ మేనేజర్ గా పనిచేసేవాడు.

యూట్యూబ్‌లో ఫైజల్‌ఖాన్ పోస్టు చేసిన వీడియో చూసి మంచి జీతం వస్తుందన్న ఆశతో అతన్ని సంప్రదించారు. అతనికి డబ్బులు చెల్లించి రష్యాకు వెళ్లారు. దాదాపు రెండు నెలలుగా తన సోదరుడి ఆచూకీ లేదని, తామంతా ఆందోళన చెందుతున్నామని అఫ్సర్ అన్న మహమ్మద్ ఇమ్రాన్ ఆందోళన వ్యక్తం చేశారు. "చివరిసారిగా డిసెంబరు 31న మాతో మాట్లాడాడు. ఆ తర్వాత మాతో టచ్‌లో లేడు. ఇక్కడ ట్రెనింగ్ వేరుగా ఉంది. ఇది హెల్పర్ ట్రెనింగ్‌లా లేదని అప్పట్లో మాతో చెప్పాడు. మేం ఏజెంట్లను అడిగితే అక్కడ శిక్షణలో భాగంగానే వారికి వివిధ అంశాలను నేర్పిస్తున్నారని మమ్మల్ని నమ్మబలికారని, మీరేమీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. మళ్లీ అందరూ వెనక్కి వచ్చేస్తారని ఏజెంట్లు చెప్పినా... తర్వాత మావారి ఆచూకీ ఇప్పటికీ తెలియలేదని మహమ్మద్ ఇమ్రాన్ కన్నీటి పర్యంతమయ్యారు. యూపీకి చెందిన యువకుడి ద్వారా తెలిసింది ఏంటంటే.. మా తమ్ముడి కాలికి రెండు బుల్లెట్లు తగిలాయని..! అతన్ని వెంటనే వెనక్కి రప్పించాలి." అని ఇమ్రాన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



### జనవరి 18 నుంచి సమాచారం లేదు..

తెలంగాణలోని నారాయణపేట జిల్లాకు చెందిన సయ్యద్ సుఫియాన్ జనవరి 18 నుంచి తమతో మాట్లాడటం లేదని తల్లి నసీం బాను తన కుమారుడిని తలచుకుని ఆమె కన్నీరు పెట్టుకున్నారు. "నాకు ఇక్కడ ఫోన్ అందుబాటులో లేదు. ఉన్నప్పుడు కాల్ చేస్తాను. నేను బాగానే ఉన్నాను" అని చెప్పి పెట్టేశాడు. అప్పటి నుంచి మళ్లీ ఫోన్ రాలేదు. మాకు ముందూ వెనుకా ఎవరూ లేరు. మోదీ సర్కారు స్పందించి మా కుమారుడ్ని వెనక్కు తీసుకురావాలి" అని ఆమె విజ్ఞప్తి చేశారు. నారాయణపేటలో వారి కుటుంబం నివాసం ఉంటోంది. రెండు గదుల చిన్న ఇంట్లోనే వారి జీవనం సాగుతోంది. 24ఏళ్ల సుఫియాన్ రెండేళ్లుగా దుబాయిలో పనిచేస్తున్నాడు. ఇతనికి తల్లిదండ్రులు, అక్క, అన్న ఉన్నారు. గతేడాది నవంబరు 16న మరో ఐదుగురుతో కలిసి రష్యాకు వెళ్లాడు సుఫియాన్. దుబయిలో పరిచయం అయిన మరికొందరు భారతీయ మిత్రులతో కలిసి రష్యా వెళ్లేందుకు నిర్ణయించుకున్నాడు. దాదాపు నెల రోజులుగా సుఫియాన్ కుటుంబసభ్యులకు అందుబాటులో (కాంటాక్టులో) లేడు. "వారానికోసారి కుటుంబంతో మాట్లాడేందుకు అనుమతి ఉంటుంది. యుద్ధభూమిలో ఉన్నప్పుడు ఫోన్ లో మాట్లాడితే.. సిగ్నల్స్ ఆధారంగా యుక్రెయిన్ గుర్తు పట్టే వీలుంది. అలా ఫోన్ సిగ్నల్స్ గుర్తించి డ్రోన్ దాడులు చేస్తోంది. యుద్ధభూమిలో ఫోన్లను వినియోగించడం లేదు. అందుకే వారు కుటుంబంతో కాంటాక్టులో లేరు" అని ఫైజల్ ఖాన్ వెల్లడించారు.





### 16 మందిలో పది మంది ఆచూకీ గల్లంతు...?

రష్యా వెళ్లిన 16 మందిలో ఆరుగురి ఆచూకీ మాత్రమే తెలుస్తోందని, మరో పది మంది ఆచూకీ తెలియాల్సి ఉందని ఫైజల్ చెప్పారు. "వైరల్ గా మారిన వీడియో పంపించిన యూపీకి చెందిన హుస్సేన్ నాతో కాంటాక్టు అయ్యాడు. ఆయన్ను గైడ్ చేసి మాస్కోకు తీసుకురాగలిగాం. ప్రస్తుతం అతను సేఫ్‌గానే ఉన్నాడు. ఆచూకీ లేని వారి కోసం ఎంబసీ, రష్యా ఆర్మీ అధికారులతో సంప్రదించేందుకు ప్రయత్నిస్తున్నాం" అని ఫైజల్ ఖాన్ తెలిపారు. రష్యాకు వెళ్లిన వారిలో తెలంగాణ యువకులతో పాటు మరికొందరి ఆచూకీ తెలియక పోవడంతో కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. "ఆరుగురు టచ్ లో ఉన్నారు. ఇద్దరు ఫ్రంట్ లైన్ సైనికులుగా యుద్ధంలో ఉన్నట్లు తెలిసింది. నాకు ఆర్మీ అధికారులు హెల్పర్స్ అని చెబితేనే నేను యువకులను పంపించా. కానీ రష్యా అధికారులు వారిని సైనికులుగా మార్చుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### వాగ్నర్ గ్రూపులోకి చేర్పించారా..?

భారతీయ యువకులను రష్యాలోని ప్రైవేటు సైన్యంగా పేరున్న వాగ్నర్ గ్రూపులో చేర్పించినట్లు అనుమానాలు కలుగుతున్నాయి. ఈ విషయంపై ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక సమాచారం లేదు. అయితే అక్కడికి చేరుకున్న భారతీయ యువకులు అంతా అధికారికంగా రష్యన్ ఆర్మీ అని చెప్పినప్పటికీ, అనధికారికంగా వాగ్నర్ గ్రూప్ సైన్యంలోకి వారిని పంపినట్లు గా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తొలుత వాగ్నర్ గ్రూప్ అని చెప్పి.. తర్వాత రష్యన్ ఆర్మీలో పనిచేసేందుకు రిక్రూట్ చేసినట్లు చెప్పారు. ఇదే విషయంపై రష్యాలో ఏజెంటుగా ఉన్న మొయిన్‌ను సంప్రదించేందుకు ఒక జాతీయ మీడియా సంస్థ ప్రయత్నించింది. అతను ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. దీనిపై హైదరాబాద్ నాంపల్లిలో ఉండే అఫ్సన్ సోదరుడు మహమ్మద్ ఇమ్రాన్ తో ఆ సంస్థ ప్రతినిధులు మాట్లాడారు. "బాండ్ పేపర్ రష్యన్ భాషలో ఉంది. తర్వాత మా తమ్ముడు నాకు బాండ్ పేపర్లోని వివరాలు పంపించినప్పుడు అనువాదం చేసుకుని చదివా. అందులో వాగ్నర్ గ్రూప్ అని లేదు కానీ రష్యన్ ఆర్మీ అనే ఉంది." అని వివరించారు.

### మూడు దేశాలు.. ఐదుగురు ఏజెంట్లు

ఈ వ్యవహారం వెనుక మొత్తం ఐదుగురు ఏజెంట్ల పాత్ర ఉన్నట్లు సమాచారం. వీరంతా ఇండియాకు చెందిన వారే. కానీ వేర్వేరు దేశాల్లో ఉంటున్నారు. రష్యాలో ఆర్మీ సహా వేర్వేరు సంస్థల్లో ఉద్యోగాల పేరిట భారతీయ యువకులను తీసుకెళ్లి వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. రాజస్థాన్ కు చెందిన మొయిన్, తమిళనాడుకు చెందిన పళనిసామి రమేశ్ కుమార్ రష్యాలో ఉండి ఆపరేట్ చేస్తున్నారు. వీరికి అనుసంధానంగా దుబయిలో ఫైజల్ ఖాన్ ఉంటున్నారు. ఇతను బాబా వ్లాగ్స్ పేరిట యూట్యూబ్ ఛానల్ నడుపుతున్నారు. అందులో ప్రకటనలు ఇచ్చి యువతకు వల వేస్తుంటారు. ముంబయిలో సుఫియాన్, పూజ అనే ఏజెంట్ల ద్వారా భారతీయ యువకులకు వల వేస్తున్నారు. ఘటన తర్వాత ముంబయిలోని ఏజెంట్లు ఫోన్లో అందుబాటులోకి రావడం లేదు. ఫైజల్ ఖాన్ అందుబాటులోకి రావడంతో మీడియా సంస్థ మాట్లాడింది. రష్యాలోని మొయిన్ ను సంప్రదించగా, అతను తర్వాత మాట్లాడతానని ఫోన్ పెట్టేసి మళ్లీ కాంటాక్టులోకి రాలేదు.

### ఒక్కొక్కరి నుంచి రూ. 3లక్షలు వసూలు

రష్యాకు వెళితే రూ. లక్ష నుంచి రూ. 1.50 లక్షల జీతం వస్తుందని ఏజెంట్లు ఆశ చూపించారు. అక్కడికి వెళ్లిన తర్వాత ట్రెనింగ్ పేరిట మొదటి మూడు నెలలకు రూ.40–50వేలు మాత్రమే చెల్లించేవారు. తర్వాత జీతం పెరుగుతుందని ఫైజల్ ఖాన్ వారితో చెబుతూ వచ్చాడు. యువకుల నుంచి మూడు లక్షలు ఫైజల్ ఖాన్ వసూలు చేశాడు. వీరంతా ఉద్యోగాలు చేసో... చిన్ని చిన్న వ్యాపారాలు చేసుకున్న డబ్బులో లేక అప్పులు తీసుకువచ్చి అతనికి చెల్లించారు. "మా తమ్ముడు దుబయిలో ఉన్నప్పుడు మొదటి ఏడాది బాగానే డబ్బు పంపించేవాడు. ఏదైనా ఒక నెల పంపించకపోయినా, తర్వాత నెలలో పంపించేవాడు. రెండో ఏడాది మాత్రం పూర్తిగా పంపించడం ఆపేశాడు.

(మిగతా 9వ పేజీలో)

( 8వ పేజీ తరువాయి)

తను సంపాదించిన మొత్తాన్ని దాచుకుని ఏజెంట్లకు ఇచ్చాడు. రష్యాకు వెళితే ఎక్కువ సంపాదించి జీవితంలో స్థిరపడవచ్చని భావించాడు. కానీ, ఇప్పుడు పరిస్థితి మొత్తం మారిపోయింది." అని తెలంగాణలోని నారాయణపేటకు చెందిన సుఫియాన్ అన్న సయిద్ సల్మాన్ అన్నారు. "ప్రతి ఒక్కరి నుంచి రూ. 3లక్షలు తీసుకున్న మాట నిజమే. అది ప్రక్రియలో భాగమే. అందులో నేను కేవలం రూ. 50వేలు తీసుకుని మిగిలిన మొత్తాన్ని రష్యాలోని ఏజెంట్లకు ఇచ్చేవాడిని." అంటూ ఏజెంట్ ఫైజల్ ఖాన్ సమర్థించుకోవడం గమనార్హం.

**రష్యా వెళ్లేంత వరకూ రహస్యమే..**

రష్యా వెళ్లేంత వరకు అక్కడికి వెళుతున్నట్లు తమకు ఏమీ తెలియదని సల్మాన్ చెప్పారు. కేవలం యూరోపియన్ దేశాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామనే ముందుగా చెప్పేవాడు. రష్యాకు వెళ్లే విషయాన్ని ఏజెంట్లు చెప్పొద్దన్నారట. ఎందుకంటే రష్యా వెళ్లాలంటే, రూ. 20–25లక్షలు ఖర్చు అవుతుంది. కానీ, మేం మాత్రం 3 లక్షలే తీసుకుని రష్యా పంపిస్తున్నాం. ఈ విషయం బయట తెలిస్తే అందరూ మమ్మల్ని ఇబ్బంది పెడతారని ఏజెంట్లు నమ్మబలికి, కనీసం ఇంట్లో కూడా చెప్పనివ్వలేదు." అంటూ సల్మాన్ రోధిస్తున్నారు.

**భారత విదేశీ వ్యవహారాల శాఖ ఏమందంటే..**

రష్యాలోని యుద్ధభూమిలో భారతీయ యువకులు చిక్కుకుపోయిన విషయంపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. ఈ మేరకు వార్త సంస్థ ఏఎన్ఐ ఎక్స్‌లో ట్వీట్ చేసింది. భారత విదేశీ వ్యవహారాల ప్రతినిధి రంధీర్ జైశ్వాల్ స్పందిస్తూ.. "రష్యా ఆర్మీలో ఉద్యోగాల కోసం కొందరు భారతీయులు వెళ్లి చిక్కుకున్నట్లు తమ దృష్టికి వచ్చింది. అక్కడ చిక్కుకున్న వారిని త్వరగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు రష్యా అధికారులతో భారత ఎంబసీ సంప్రదింపులు జరుపుతోంది. ▯ భారతీయులు జాగ్రత్తగా ఉ



ంటూ ఇలాంటి మోసాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నాం" అని చెప్పారు.

**నాంపల్లి పోలీసుస్టేషన్ లో కేసు నమోదు**

తన సోదరుడు కనిపించకపోవడంపై హైదరాబాద్ నాంపల్లి పోలీసుస్టేషన్‌లో ఇమ్రాన్ ఫిర్యాదు చేశారు . ఏజెంట్ ఫైజల్ ఖాన్‌పై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై నాంపల్లి పోలీసులు ఫైజల్‌ఖాన్‌పై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**-వి.వి.వెంకటేశ్వరరావు, 6300866637.**

# పిల్లల పరీక్షల ఒత్తిడి తగ్గించడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

పరీక్షలు అనేవి ఎల్లప్పుడూ ఎప్పటికీ ఒత్తిడితో కూడుకున్నవే. పిల్లలకు మాత్రమే కాదు మొత్తం కుటుంబానికి ఒత్తిడితో కూడుకున్న సమయం. ఈ ఒత్తిడితో భావోద్వేగాలలో సమతుల్యత ఏర్పడి, కుటుంబ పెద్దలు పిల్లలపై కోపాన్ని ప్రదర్శించడం జరుగుతూ ఉంటుంది. దీనితో పిల్లలలో మరింత ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉంది. ఒత్తిడిని అధిగమిస్తే పరీక్షలలో విజయం సాధించడం చాలా తేలిక అని గుర్తించాలి. పిల్లలు తక్కువ సమయంలో ఎక్కువ అంశాలు నేర్చుకోవాలి, వాటినన్నింటిని గుర్తుపెట్టుకొని పరీక్షలలో రాసి మంచి మార్కులు సంపాదించుకోవాలి. పరీక్షల సమయంలో పిల్లలు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతారు. తల్లిదండ్రులు వారి పిల్లల బంగారు భవిష్యత్తు గురించి తీవ్రంగా చాలా ఆలోచిస్తూ, మనసులో కలిగే ఆందోళనలతో, పిల్లలు జీవితంలో మంచి స్థితిలోకి రావాలనే కాంక్షతో, పిల్లలే సర్వస్వం అని భావించే తల్లిదండ్రులు కూడా తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు.



తల్లిదండ్రులలో కలిగే ఈ ఒత్తిడి ప్రభావం పిల్లలపై తీవ్రంగా చూపిస్తుందని గుర్తించాలి. పిల్లల్లో కలిగే పరీక్షల ఒత్తిడిని తగ్గించడంలో తల్లిదండ్రులదే కీలకపాత్ర. పరీక్షల ఒత్తిడి తగ్గాలంటే....

**ప్రణాళిక :** పిల్లలతో ప్రతి విషయాన్ని షేర్ చేసుకోవాలి. పరీక్షల సమయానికంటే ముందుగానే ఏవిధంగా పరీక్షలను ఎదుర్కోవాలో పిల్లలతో చర్చిస్తూ సరైన ప్రణాళికను రూపొందించుకోవాలి. ప్రణాళికను రూపొందించేటపుడు చదివే సమయంలో విరామ సమయం తప్పకుండా కేటాయించుకోవాలి, కష్టమైన సబ్జెక్ట్ లను గుర్తించి వాటికి ఎక్కువ సమయం కేటాయించేలా, వాటి పై పిల్లలు మరింత దృష్టిని కేంద్రీకరించే విధంగా ప్రణాళిక ఉండే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

**సౌకర్యవంతమైన వాతావరణం :** పిల్లలు చదువుకోవడానికి సౌకర్యవంతమైన తగు వాతావరణాన్ని ఏర్పాటు చేయాలి. టీవీ, ల్యాప్‌టాప్ , సెల్ ఫోన్ మొదలైన అంతరాయాలకు దూరంగా ఉండే విధంగా చూసుకోవాలి. పిల్లలు సౌకర్యవంతంగా కూర్చునే ఏర్పాటు సరిగా లేకపోతే, పిల్లలకు మెడ నొప్పి, తలనొప్పి లేదా వెన్నుముక నొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. పిల్లలు కూర్చుని చదువుకొనే స్టడీ చైర్ సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాటు చేయాలి, సోఫా లేదా మంచం లపై చదవడానికి ప్రోత్సహించవద్దు ఇలా చేస్తే కండరాల పై ఒత్తిడి కలిగి తొందరగా అలసి పోయే ప్రమాదం ఉంటుంది.

**పోషకాహారం :** పరీక్షల సమయంలో పిల్లలు తిండి తినడంలో సరైన ఆసక్తి చూపించకపోవచ్చు. పిల్లలు నిర్ణీతసమయంలో ఆహారాన్ని తీసుకోవడంలో తల్లిదండ్రులుగా సరైన బాధ్యతను పోషించాలి. కడుపులో ఆకలిగా ఉన్నప్పుడు చదువు పై ఏకాగ్రత కుదరడం చాలా కష్టం. మెదడు చురుగ్గా పనిచేయాలంటే పిల్లలు సరైన పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలి.

**మంచి నిద్ర :** పిల్లలు నిర్దేశించుకున్న లక్ష్యం పూర్తి చేయడానికి నిద్రను దరి చేరనీయకుండా చేస్తూ తీవ్రంగా కష్టపడుతూ చదువుతూ ఉంటారు. మంచి నిద్ర వలన జ్ఞాపక శక్తి మరియు ఏకాగ్రత పెరుగుతాయి. పరీక్షకు ముందు రోజు అర్ధరాత్రి వరకు కష్ట పడుతూ చదవడం మంచిది కాదు. పిల్లలు ప్రతిరోజూ కనీసం 6 నుండి 7 గంటలపాటు నిద్రపోయే విధంగా తగు సూచనలు ఇస్తూ గమనిస్తూ ఉండాలి. నిద్ర పోకుండా తీవ్రంగా కష్టపడటం కంటే మంచి నిద్ర తీసుకోవడం వలన ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయి.

**సహాయకరిగా ఉండాలి :** పిల్లలకు తల్లిదండ్రులు ఎల్లపుడు సహాయకారిగా ఉండాలి. పిల్లలు ఎక్కువ సమయం చదవడానికి కేటాయిస్తున్నప్పుడు, ఇతర పనులలో వారికి సహాయకారిగా ఉండాలి. పిల్లలు చదువుకునే గదిని శుభ్రంగా ఉంచడం చేయాలి.ఇతర పనుల పట్ల వాళ్ల ఆలోచనలు మరలకుండా తగు జాగ్రత్తను తీసుకుంటే ఏకాగ్రతతో చదివే అవకాశం ఉంటుంది.

**పిల్లలతో మాట్లాడండి :** పరీక్షల సమయంలో పిల్లలతో గడపడానికి, వారితో మాట్లాడడానికి ఎక్కువ సమయం కేటాయించాలి. పిల్లల మానసిక స్థితి, ఆందోళనలను, భయాన్ని గమనిస్తూ తగిన విధంగా గైడ్ చేస్తూ ఉండాలి. పరీక్షల సమయంలో భయం కలగడం సర్వసాధారణం అని వివరిస్తూ పరీక్షలకు బ్రహ్మాండంగా ప్రిపేర్ అవుతున్నావనే ప్రోత్సాహాన్ని అందించాలి, ఆందోళన పడవల్సిన అవసరం లేదని వారికి భరోసాను ఇస్తూ ఉండాలి.

**శారీరక ఆటలను ప్రోత్సహించాలి :** పరీక్షల సమయంలో పూర్తిగా ఆటలు ఆడరాదని నిబంధన విధించడం సరి కాదు. శారీరక ఆటలు ఆడడం వలన మనస్సుకు విశ్రాంతి దొరుకుతుంది. ఒత్తిడి తగ్గుతుంది మరియు శక్తిసామర్థ్యాల స్థాయిలు పెరుగుతాయి.పరీక్షల సమయంలో కూడా నిర్ణీత సమయంపాటు శారీరక ఆటలకు అనుమతించాలి.

**ఒత్తిడిని పెంచవద్దు :** గతంలో పిల్లల ఫేయిల్యూర్స్ ను పదే పదే గుర్తుచేస్తూ పిల్లలలో ఒత్తిడిని పెంచకూడదు. ఆత్మవిశ్వాసం సన్నగిల్లే ప్రమాదం కూడదు. పిల్లలు పరీక్షకు హాజరు కావడానికి ముందు వారికి సానుకూల ఆలోచనలను (పాజిటివ్ థింకింగ్స్) కల్పించాలి. పిల్లలను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూ, పిల్లల సామర్థ్యానికి తగ్గట్లుగా, వాస్తవిక లక్ష్యాలను నిర్దేశించాలి.

వైఫల్యాలను ఆమోదించాలని పిల్లలకు శిక్షణ ఇవ్వాలి ( ధించడానికి కావల్సిన సంకల్ప బలం అందిస్తుందని ప్రోత్సహించాలి.

పిల్లలను బహుమతులతో ప్రోత్సహించండి : పరీక్షల ముగిసిన సమయం కూడా మరో పరీక్షకు ప్రారంభ సమయమని గుర్తించాలి. పరీక్షల సమయంలో తీవ్రమైన ఒత్తిడికి గురయ్యి ఉంటారు. పరీక్షలు ముగిసిన వెంటనే విహారయాత్రకు గాని, లేదా పిల్లల కృషికి అభినందనీయంగా బహుమతిని అందించాలి. పరీక్షలలో పొందే మార్కులతో కాకుండా పిల్లలను పిల్లలుగానే గుర్తించాలి. పిల్లల పట్ల స్నేహపూర్వకంగా మెదలుతూ ఉండాలి.

# సినిమా రివ్యూ

వరుణ్ తేజ్.. మెగా కంపౌండ్ నుంచి వచ్చిన హీరో. కానీ, సినిమాల ఎంపికలో కొంత వైవిధ్యమైన ధోరణి కనబరుస్తాడు. ఫిదా.. ముకుంద..గని.. గద్దలకొండ గణేష్.. అంతరిక్షం.. ఇలా ఒకదానికొకటి సంబంధం లేని సినిమాలను ఎంచుకుని చేస్తుంటాడు. అదే కోవలో ఇప్పుడు ఆపరేషన్ వాలంటైన్ సినిమా తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఫిదా, తొలిప్రేమ తర్వాత వరుణ్ తేజ్ కు హిట్ పడలేదు. గని, గాండీవధారి అర్జునుడు తో డిజాస్టర్లు పడ్డాయి. అయినా, తన ప్రయోగాల దారిని మార్చుకోలేదు. ఆపరేషన్ వాలంటైన్ ఈరోజు అంటే మార్చి 1న విడుదలైంది. పుల్వామా ఉగ్రదాడి నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఈ సినిమా ఎలా ఉందో చూద్దాం..



**ఇదీ స్టోరీలైన్..** ఇండియన్ ఎయిర్ ఫోర్స్ స్క్వాడ్రన్ లీడర్.. అర్జున్ రుద్రదేవ్ అలియాస్ రుద్ర (వరుణ్ తేజ్). ఏదైనా సరే ఏమి జరుగుతుంది? చూద్దాంలే అని ప్రమాదాలకు ఎదురు వెళ్లే వ్యక్తి అతను. అతను ఎయిర్ ఫోర్స్‌లో పనిచేసే రాడార్ ఆఫీసర్ అహానా గిల్ (మానుషి చిల్లర్)ని ప్రేమిస్తాడు. ఈ క్రమంలో అర్జున్ వజ్ర అనే ప్రాజెక్ట్ కోసం పని చేస్తాడు. ఆ సమయంలో అతనికి చేదు అనుభవం ఎదురవుతుంది. తన ప్రమాదాలకు ఎదురువెళ్లే తత్వంతో అందులో దెబ్బతింటాడు. ఈ దెబ్బ నుంచి బయటపడుతూనే ఆపరేషన్ వాలంటైన్ (%ాజూవతీు-అశీఱ ఋశ్రీవత్‌ఱఅవ వీశీజఱవ =వజఱవఎ%)గురించి రంగంలోకి దిగుతాడు అర్జున్. అసలు ఈ ఆపరేషన్ ఏమిటి? దానికి వజ్ర ప్రాజెక్ట్ కి లింక్ ఏమిటి? అసలు ఏ లక్ష్యం కోసం ఈ ఆపరేషన్? ఈ విషయాలన్నీ సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.

**ఎలా ఉందంటే..** సినిమా సాదాసీదాగా ప్రారంభం అవుతుంది. ఒకవిధంగా ఫస్టాఫ్ అసలు ఎవరికీ కనెక్ట్ కాదు. ఏదేదో జరుగుతూ ఉంటుంది. పుల్వామా దాడి నేపథ్యంలో సినిమా అనేసరికి సినిమాకి వెళ్లిన వాళ్ళు కనెక్ట్ అయ్యే విధంగా ఫస్టాఫ్ లో ఏమీ ఉండదు. కానీ.. ఇంటర్వెల్ ముందు బ్యాంగ్ లో ఒక్కసారిగా తరువాత ఏమవుతుంది? అనే ఉత్కంఠ కచ్చితంగా అందరికీ కలుగుతుంది. దానికి తగ్గట్టే సెకండ్ హాఫ్ సినిమా.. పూర్తిస్థాయి ఎమోషన్.. యాక్షన్ తో సాగుతుంది. అందరికీ పుల్వామా దాడి అంటే తెలుసు. కానీ, ఇది ఎలా జరిగింది? దీనివెనుక ప్రభుత్వం ఏ రకమైన విధానాల్ని అనుసరించింది.. ఇలాంటి పాయింట్స్ అన్నిటినీ చూపించే ప్రయత్నం దర్శకుడు చేశాడు. సినిమా చివరికి వచ్చేసరికి గూస్ బంప్స్ వచ్చేలా క్లైమాక్స్ ఉంటుంది. ప్రీ క్లైమాక్స్.. క్లైమాక్స్ అయితే.. సినిమా చూసే ప్రతి పేక్షకుడికి దేశభక్తి పొంగిపోయేలా ఉంటాయి. ప్రతి సీన్.. ప్రేక్షకుడ్ని పుల్వామా సమయంలో దేశంలో పరిస్థితికి కనెక్ట్ చేసేస్తుంది.

**ఎవరెలా చేశారంటే..** %వరుణ్ తేజ్ అర్జున్ గా అదరగొట్టేశాడని చెప్పాలి. తనదైన శైలిలో ఆ క్యారెక్టర్ కి న్యాయం చేశాడు. ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్‌గా అర్జున్ దేవ్ పాత్రకు వరుణ్ తేజ్ సరిగ్గా సరిపోతాడు. అతన్ని సినిమాలో చూస్తుంటే నిజంగా మనం వింగ్ కమాండర్ ని చూస్తున్నట్లుగా అనిపిస్తుంది. మానుషి చిల్లర్ అందంగా కనిపించింది. ఎమోషనల్ గా బాగా చేసింది. ఇక నవదీప్ పాత్ర అర్ధాంతరంగా ఆగి పోతుంది. బాగానే చేశాడు. శుభ శ్రీ, లహరి, శ్వేతా వర్మ కూడా కనిపిస్తారు. అయితే వారి పాత్రలకు పెద్దగా ప్రాధాన్యత లేదు. మిగిలిన వారంతా ఉన్నటంతలో బాగానే చేశారు.

**టెక్నికల్ గా..** బీజీఎం, వీఎఫ్ఎక్స్, సినిమాటోగ్రఫీ ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని చెప్పవచ్చు. టెక్నికల్ డిపార్ట్‌మెంట్ల పనితీరు ఈ సినిమాని సాధారణ ప్రేక్షకులకు కూడా మంచి అనుభూతిని ఇస్తుందనడంలో సందేహం లేదు. అన్ని సన్నివేశాలు చాలా రిచ్‌గా వచ్చాయి. సోనీ పిక్చర్స్ నిర్మాణ విలువలు హై స్టాండర్డ్‌గా ఉన్నాయని చెప్పవచ్చు. దేశభక్తి సినిమాలను ఇష్టపడే వారికి ఈ సినిమా నచ్చుతుంది. కొన్ని సన్నివేశాలు చాలా ఎమోషనల్‌గా ఉంటాయి, ఇది సినిమాకు మంచి హైప్ ఇచ్చింది.

**మొత్తంగా చూసుకుంటే,** ఆపరేషన్ వాలంటైన్ సినిమా ఒకసారి థియేటర్లలో చూడదగ్గ సినిమాగా చెప్పుకోవచ్చు. ఫస్టాఫ్ కాస్త గందరగోళంగా అనిపించినా.. సెకండ్ హాఫ్ సినిమా మాత్రం వేరే లెవెల్ లో ఉంటుంది. మనం ఫస్టాఫ్ చూసిన విషయమే మర్చిపోతాం. సెకండ్ హాఫ్ లో ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్ అయితే నెక్స్ట్ లెవెల్. దేశభక్తి సినిమాలు ఇష్టపడే వారే కాకుండా.. సాధారణ ప్రేక్షకులకు కూడా దేశభక్తిని కచ్చితంగా రేకెత్తించేలా ఉంటుంది సినిమా సెకండ్ హాఫ్. అదండీ విషయం ఫలితాలతో పనిలేకుండా.. వెరైటీ సినిమాలు చేయాలనుకునే వరుణ్ తేజ ప్రయత్నాల్లో ఆపరేషన్ వాలెంటైన్ ఒక

---

స్టార్ స్టేటస్, ఇమేజ్ పక్కనపెట్టి సినిమాలు చేయడం సులభం కాదు. బోలెడు లెక్కలు, ఆలోచనలు ఉంటాయి. ఆ బ్యారియర్ బ్రేక్ చేసిన హీరో మమ్ముట్టి. 'కాదల్ ది కోర్'లో గే రోల్ చేయడం అంటే మాటలా? ఆ సినిమా ఒక్కటే కాదు... 'రోర్‌షాక్'లోనూ వైవిధ్యమైన సన్నివేశాలు చేశారు. ఒకవైపు కమర్షియల్, మరోవైపు డిఫరెంట్ కంటెంట్ బేస్డ్ సినిమాలు చేస్తున్నారు. ఆయన నటించిన కొత్త సినిమా 'భ్రమయుగం'. మలయాళంలో గురువారం విడుదలైంది. త్వరలో తెలుగులో విడుదల కానుంది.

'ఇరుది సుట్రు' (తెలుగులో 'గురు'గా రీమేక్ చేశారు), 'విక్రమ్ వేద', 'మండేలా' వంటి కంటెంట్ రిచ్ ఫిల్మ్స్ ప్రొడ్యూస్ చేసిన వై నాట్ స్టూడియోస్, హారర్ థ్రిల్లర్ ప్రొడ్యూస్ చేయడం కోసం ఏర్పాటు చేసిన నైట్ షిఫ్ట్ స్టూడియోస్ కలిసి మమ్ముట్టి 'భ్రమయుగం' చిత్రాన్ని నిర్మించాయి. 'భూతకాలం' ఫేమ్ రాహుల్ సదాశివన్ దర్శకత్వం వహించారు. చక్రవర్తి రామచంద్ర, ఎస్.శశికాంత్ నిర్మాతలు. ఈ సినిమా ఎలా ఉందో రివ్యూలో చూడండి.



**కథ:**

తేవన్ (అర్జున్ అశోకన్) జానపద గాయకుడు. తక్కువ కులానికి (పానన్) చెందినవాడు. తల్లి దగ్గరకు వెళుతూ అడవిలో తప్పిపోతాడు. ఆకలితో తిరిగి తిరిగి చివరకు ఓ పాడుబడ్డ ఇంటికి చేరుకుంటాడు. అందులో ఇద్దరు మాత్రమే ఉంటారు. ఒకరు వంటవాడు (సిద్ధార్థ్ భరతన్). మరొకరు యజమాని కుడుమోన్ పొట్టి (మమ్ముట్టి). తక్కువ కులానికి చెందిన వాడని తక్కువ చేయకుండా, ఇంటికి వచ్చిన అతిథి అంటూ తేవన్‌ను తనతో పాటు సమానంగా చూస్తాడు. అయితే... తనను కుడుమోన్ పొట్టి ట్రాప్ చేశారని తక్కువ సమయంలోనే తేవన్ తెలుసుకుంటాడు. ఆ ఇంటి నుంచి పారిపోవాలని ప్రయత్నిస్తాడు. అయితే... తాంత్రిక విద్యలతో అతడు మళ్లీ ఇంటికి వచ్చేలా చేస్తాడు కుడుమోన్ పొట్టి. అసలు అతని నేపథ్యం ఏమిటి? అతని గురించి తెలిసి వంటవాడు ఆ ఇంటిలో ఎందుకు ఉన్నాడు? చివరకు ఏమైంది? ఆ ఇంటి నుంచి తేవన్ తప్పించుకున్నాడా? లేదా? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

**విశ్లేషణ:**

కేవలం మూడు పాత్రలతో రెండున్నర గంటల సినిమాను నడిపించడం సులభమేనా? ఈ కాలంలో బ్లాక్ అండ్ వైట్ ఫార్మాట్ సినిమా తీస్తే ప్రేక్షకులు చూస్తారా? ఎటువంటి హీరోయిజం లేకుండా సినిమా అంతా ఒక్కటే డ్రస్‌లో స్టార్ హీరోని చూపిస్తే అభిమానులు యాక్సెప్ట్ చేస్తారా? వంటి సందేహాలకు 'భ్రమయుగం' చెక్ పెడుతుంది. కంటెంట్ ఉంటే అటువంటి సందేహాలు అవసరం లేదని నిరూపిస్తుంది. ఇక... 'భ్రమయుగం' సినిమాకు వస్తే?

**టెక్నికల్ బ్రిలియన్స్, ఫెంటాస్టిక్ పెర్ఫార్మన్స్ కలిస్తే...**

'భ్రమయుగం'. ప్రేక్షకుల్ని ఆ ప్రపంచంలోకి తీసుకు వెళ్ళడానికి దర్శకుడు కొంత సమయం తీసుకున్నాడని చెప్పాలి. పాత్రల పరిచయం, ఆ సన్నివేశాలు నిదానంగా సాగాయి. విశ్రాంతి ముందు వరకు సర్‌ప్రైజ్ గానీ, షాక్ గానీ ఉండదు. నిదానంగా ఆ ప్రపంచంలోకి వెళ్లేలా ఉంటుంది. 'భ్రమయుగం'లోకి వెళ్లిన తర్వాత అంత సులభంగా బయటకు రాలేం. సినిమాలో ప్రతి మాటలో, దృశ్యంలో ఓ అర్థం ఉంటుంది. ఆ కాలంలో కులవివక్ష చర్చించిన తీరు సూటిగా, ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా ఉంటుంది. క్రిస్టో జేవియర్ స్వరపరిచిన ప్రతి పాట వినసొంపుగా ఉంది. నేపథ్య సంగీతం సినిమాలో లీనం చేస్తుంది. నిర్మాణ విలువలు ఉన్నత స్థాయిలో ఉన్నాయి. బ్లాక్ అండ్ వైట్ ఫార్మాటులో ఇంత అందంగా సినిమా తీయవచ్చా? అనేలా షెహనాద్ జలాల్ కెమెరా వర్క్ అబ్బుర పరుస్తుంది. ఎడిటింగ్ నీట్‌గా ఉంది. మలయాళ సినిమాలు నిదానంగా సాగుతాయని ప్రేక్షకుల నుంచి వినిపించే మాట ఈ సినిమా విషయం లోనూ మరో మారు వినిపించవచ్చు. టెక్నికల్ బ్రిలియన్స్ పక్కన పెడితే.కథగా చూస్తే ఈ సినిమా చాలా చిన్నది. క్లుప్తం గా చెప్పాలంటే... పాడుబడ్డ భవంతి, తాంత్రిక విద్య లు నేర్చిన ఓ మాయగాడి నుంచి ఓ యువకుడు ఎలా భయపడ్డాడు? అనేది కథ. అందులో కులవివక్ష, అధి కారం కోసం మనిషి ఎలా మారతాడు? అనేది చక్కగా చెప్పారు. ఈ సినిమా థ్రిల్ ఇస్తుంది గానీ అంతగా భయపెట్టదు. హారర్ అంశాలు తక్కువ ఉన్నాయి.

**నటీనటులు**

ప్రేక్షకులు ఇప్పటివరకు చూసిన మమ్ముట్టి వేరు. ఈ 'భ్రమయుగం'లో మమ్ముట్టి వేరు. కుడుమోన్ పొట్టి క్యారెక్టర్ మాత్రమే తెరపై కనిపించేలా నటించారు. ఆ లుక్స్ నుంచి మేనరిజమ్స్ వరకు ఆయన నటన చూస్తుంటే కనురెప్ప వేయడం కూడా మర్చిపోతాం. ముఖ్యంగా పతాక సన్నివేశాల్లో అదరగొట్టేశారు. ఆయనకు ధీటుగా జానపద గాయకుడి పాత్రలో అర్జున్ అశోకన్ ఒదిగిన తీరును ప్రశంసించకుండా ఉండలేం. పాటలు పాడేటప్పుడు గానీ, మమ్ముట్టిని తొలిసారి తలెత్తి చూసేటప్పుడు గానీ, భయపడేటప్పుడు గానీ అర్జున్ అశోకన్ నటన అద్భుతం. సిద్ధార్థ్ భరతన్ సైతం చక్కగా నటించారు.

**చివరిగా**

'భ్రమయుగం' ఫిల్మ్ మేకింగ్ పరంగా హై స్టాండర్డ్స్ సెట్ చేసే సినిమా. మమ్ముట్టి నట విశ్వరూపానికి అర్జున్ అశోకన్ అద్భుత నటన, బ్లాక్ అండ్ వైట్ విజువల్స్, క్రిస్టో జేవియర్ పాటలు అండ్ నేపథ్య సంగీతం మనల్ని సరికొత్త ప్రపంచంలోకి తీసుకు వెళతాయి. క్లైమాక్స్ ఒక హై ఇచ్చి పంపిస్తుంది సినిమా. థియేటర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ప్రేక్షకులు 'భ్రమయుగం' ట్రాన్స్‌లో ఉండటం గ్యారంటీ. డోంట్ మిస్ ద క్లైమాక్స్!

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)

నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడ్పుగంటి పద్మజారాణి
91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com



# 3.3.2024 నుంచి 9.3.2024 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

వారం ప్రారంభంలో ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి ప్రతి విషయంలోన ఆలస్యాలు ఆటంకాలు చికాకును కలిగిస్తాయి. సంఘంలో గౌరవం, వృత్తిపరమైన అభివృద్ధి, నూతన వ్యక్తుల పరిచయాలు, ఆరోగ్య విషయాలు తీసుకోవాలి .సంబంధము లేని విమర్శలు మనసుని ఇబ్బంది పెడతాయి. సంతానమునకు కొత్త అవకాశాలు ఉన్నప్పటికీ వారము మధ్యలో మీ మాటల వల్ల కుటుంబ సభ్యులలో అపారాలకు అవకాశము. ఉన్నతాధికారంలో ఉన్న వ్యక్తుల తో ఘర్షణలు రాకుండా జాగ్రత్త పడాలి. మానసిక ప్రశాంతత తగ్గుతుంది. వృత్తిపరంగా నూతన ప్రయత్నాలు, పెద్దల సహకారం. కొత్త కొత్త కొనుగోలు అంశాలలో పరిచయములేని వారు మోసం చేసేందుకు అవకాశం ఉంది. సంతానానిక విద్యా విషయాలలో ఎక్కువ శ్రద్ధ.



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వార ప్రారంభంలో సంఘంలో పలుకుబడి పెరుగుతుంది సామాజిక సేవ చేస్తారు. నూతన వ్యక్తుల పరిచయాలు. విద్యార్థులకు పోటీ తత్వం పెరుగుతుంది. శ్రమకి తగిన ఫలితాన్ని పొందుతారు. ఆరోగ్య మీద శ్రద్ధ అధికంగా ఉంటుంది రోగనిరోధక శక్తిని పెంచుకుంటారు. నూతన ప్రదేశాలను దర్శించడానికి చాలా ఉత్సాహంగా ఉంటారు. భాగస్వామికి సంబంధించిన ఖర్చు అధికంగా ఉంటాయి రుణములు చెల్లిస్తారు కొత్తరుణం కొరకు ప్రయత్నం చేస్తారు. సేవకులు సహకరిస్తారు. కుటుంబంలోని వ్యక్తులకు నూతన వృత్తిలో అవకాశాలు. సంతానానికి అభివృద్ధి. ఆత్మీయులైన మిత్రులతోనూ సోదరీ వర్గంతోనూ సమావేశాలు చర్చలు. కొత్త బహుమానాలు అందుకుంటారు. వారం మధ్యలో ఆరోగ్య శ్రద్ధ అవసరము, మానసిక ప్రశాంతత తగ్గుతుంది



## మిధున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో గవర్నమెంట్ వృత్తుల కొరకు పోటీ పరీక్షలకు సంతానము చేయు ప్రయత్నాలకు మీ ఆత్మీయుల మాట, ధన సహకారం తోడ్పాటు అందిస్తారు అని మీరు ఆశించి సంప్రదించడానికి ప్రయత్నాలు చేస్తారు. రావలసిన రుణములు అందుకుంటారు. విద్యార్థులు గట్టి శ్రమ మీద పరీక్షలకు సిద్ధం అవుతారు.సంతానము అభివృద్ధి కరంగా ఉంటుంది.మధ్యలో ఉన్నత అధికారులతో విభేదాలు రాకుండా జాగ్రత్త వహించాలి. విదేశాల కొరకు ఎదురుచూస్తున్న ఆహ్వానాలని అందుకుంటారు. ముఖ్యముగా స్త్రీ సంతానం వృత్తిపరంగా చేసే ప్రయత్నాలలో అభివృద్ధికరంగా ఉంటుంది. వారం చివరిలో భాగస్వామి మరియు తండ్రి ఆరోగ్యం మీద శ్రద్ధ వహించాలి.



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో సమయానికి ఆహార స్వీకరణ మంచిది తగిన విశ్రాంతి అవసరము. జ్ఞాపక శక్తిని మెరుగు పరుచుకునే విషయాల్లో శ్రద్ధ వహించాలి. పరీక్షలు,విద్యాపరమైన విషయాలలో విద్యార్థులు చాలా శ్రమ పడతారు. ఉపాసన అంశాలలో కొన్ని అవరోధాలు చికాకును కలిగిస్తాయి. వృత్తిపరంగా శ్రమ బాధ్యత అధికంగా ఉన్నప్పటికీ తగిన గుర్తింపుని గౌరవాన్ని పొందుతారు నూతన ప్రయత్నాలు చేస్తారు. ఆర్థిక విషయాలలో స్థిరాస్తుల అంశాలలో వాతావరణం కొంత చికాకుగా ఉన్నప్పటికీ, పెద్దల సహకారంతో దాన్ని అధిగమిస్తారు. భాగస్వామి వృత్తిపరమైన విషయాలలో కొంత అభివృద్ధి మీకు సంతోషాన్ని కలిగిస్తుంది. నూతన వాహన గృహ కొనుగోలు కొరకు ఆలోచనలు అధికం చేస్తారు.



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంలో వాహనములకు సంబంధించిన చిన్న బాటి రిపేర్లు. నూతన విషయాలు తెలుసుకుంటారు. గృహ మార్పు కొరకు ఆలోచిస్తారు.భాగస్వామికి ఆదాయం అభివృద్ధి, వృత్తిపరమైన విషయాలలో ఉన్నత అధికారుల సహకారం, కింద పని చేసే సిబ్బంది సహాయం,ఆకస్మికమైన విషయాలలో కొంత లాభం, స్థిరాస్తులు అంశములలో ఆత్మీయ వర్గంతో కొంత ఘర్షణాత్మకమైన వాతావరణం, శుభకార్యాలకు ఆహ్వానాలు. ముఖ్యమైన కార్యక్రమాలు ఆలస్యాలు, వారం మధ్యలో వ్యాపార పరంగా అభివృద్ధి కొరకు ప్రయత్నాలు చేస్తారు. వృత్తిపరంగా నూతన పెట్టుబడుల కొరకు ఆలోచనలు చేస్తారు.మిత్రులను కలుస్తారు. వృత్తిపరమైన విషయాలలో పెట్టుబడి పెడతారు. స్త్రీల సహకారాన్ని పొందుతారు.



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంలో సమయస్ఫూర్తి నిర్ణయాలు తీసుకుంటారు. శారీరక శ్రద్ధ ఆకర్షణ పెరుగుతాయి. సంతోషంగా ఉంటుంది, మిత్రులు తోబుట్టువులు సహకరిస్తారు ఆత్మీయులతో కలిసి మంచి వాతావరణంలో చిన్నపాటి ప్రయాణాలు గెట్ టుగెదర్లు. మాటలతో అందరినీ ఆకట్టుకుంటారు. కమ్యూనికేషన్ బాగుంటుంది కళాకారులకు గుర్తింపు. వారం మధ్యలో కుటుంబ వాతావరణం కొంత ఘర్షణాత్మకంగా ఉంటుంది. ఆకస్మిక ఖర్చులు పెరుగుతాయి. వృత్తిపరమైన, భూ సంబంధ అంశములలో ఉన్నత అధికారులతో ఆచితూచి వ్యవహరించాలి. వాదనలకు దూరంగా ఉండాలి.ఆరోగ్యం మీద కొంత శ్రద్ధ చూపించాలి. ప్రయాణాలు చేసేటప్పుడు కొత్త వ్యక్తులతో జాగ్రత్తగా వ్యవహరించాలి.



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో ఎదుటివారితో మాటల వల్ల అపార్థాలు రాకుండా జాగ్రత్త వహించాలి. రావలసిన ధనము సమయానికి అందడంలో కొంత ఆలస్యం ఆటంకం నిరాశను కలిగిస్తుంది కోపాన్ని నియంత్రించుకోవాలి.వృత్తిపరంగా ఉన్నతాధికారులతో వాగ్వాదాలకు లోను కాకుండా సమయస్ఫూర్తిగా వ్యవహరించాలి. వృత్తిపరంగా అధిక శ్రమ బాధ్యతలు పెరగడం వల్ల సమయానికి ఆహార స్వీకరణ విశ్రాంతి విషయాల్లో శ్రద్ధ వహించాలి. వారం మధ్యలో విదేశీ ఆదాయాన్ని, బాగస్వామి తరపున విదేశాలలో ఉన్న ఆత్మీయుల సహాయాన్ని సమయానికి పొందగలుగుతారు. స్థిరాస్తుల పెట్టుబడుల విషయాలలో కుటుంబములోని పెద్దలను గురువులను సంప్రదిస్తారు.సామరస్యంగా పనులను వ్యక్తుల సహకారంతో ధైర్యంగా నిర్ణయాలు



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో గతంలో ఇచ్చిన రుణములు తిరిగి రావడం కొంత కష్టం. నూతన ప్రణాళికల కొరకు ఆలోచనలు చేస్తారు. కుటుంబ అంశములలో తీసుకున్న కొత్త నిర్ణయాల వల్ల మనసుకు కొంత తేలికపడి ఆహ్లాదకరంగా ఉంటుంది. కుటుంబ సభ్యులతో విందు వినదాల్లో పాల్గొంటారు. ముఖ్య వ్యక్తుల సహకారం లభిస్తుంది సంతానము ఎక్కువ శ్రమతో ఆశించిన ఫలితములు, విద్యార్థులకు ఎలక్ట్రానిక్ సంబంధిత వస్తువుల కొరకు ఖర్చులు అధికంగా ఉంటాయి.దూర ప్రదేశాలలో ఉండే వ్యక్తుల సహాయ సహకారములతో కొత్త నిర్ణయాలు తీసుకుంటారు. కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కొరకు ప్రయత్నం చేయు విద్యార్థులు శ్రమ అధికం చేస్తారు. నూతన కళాశాలలలో ప్రవేశం కొరకు చేయి ప్రయత్నాలు కొంతవరకు నెరవేరుతాయి. కుటుంబంలోని వారి విజయం కొంత ఆనందాన్నిస్తుంది.



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాఢ 1వ పాదము

వారం ప్రారంభంలో వృత్తిపరమైన విషయాలు వ్యాపారలవాదేవిలు కుటుంబ,గృహ, వాహన, భాగస్వామ్య అంశాలు చాలా వరకు మీకు అనుకూలంగా ఉంటాయి. రావలసిన లాభాలు ఆదాయం అందడంలో కొంత ఆలస్యాలు ఆటంకాలు ఉన్నప్పటికీ సంతానం కొరకు అధిక ఖర్చులు చేస్తారు. వృత్తిలో అధికారంలో ఉండే వ్యక్తుల సహకారం కొంత నిరాశ కల్పించినప్పటికీ వారం మధ్యలో అనుకూలతే సిద్ధిస్తుంది. సంఘంలో గౌరవము మర్యాద కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. సంతానమునకు అభివృద్ధి విదేశీ అవకాశాలు విద్యలో ముందు ఉండడం మీకు కొంత ఆనందాన్నిస్తుంది. కళాకారులకు అనుకూలమైన సమయం. రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి గవర్నమెంట్ సంబంధిత టాక్సును చెల్లిస్తారు, ముఖ్యమైన కార్యకలాపాలలో అధికారులతో విభేదాలు



## మకర రాశి

ఉత్తరషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు

వారం ప్రారంభంలో మీ వృత్తిలో ఉన్నత అధికారంలో ఉండే స్త్రీల సహకారాలు పొందుతారు. వృత్తిపరంగా అనుకోని నూతన బాధ్యతలు శ్రమ అధికం చేస్తాయి .మనసులోని కోరికలు నెరవేరడం, స్థిరాసుల మీద ఆదాయం అందుకోవడం జరుగుతుంది. ఆకస్మికమైన ఖర్చులు అధికంగా ఉంటాయి.చిన్న నాటి మిత్రులను కలుస్తారు. విద్యాపరమైన అంశాలలో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొన్ని విషయాలలో శ్రమకు తగిన ఫలితాలు వస్తుంది. స్త్రీలకు ఆదాయం అభివృద్ధి కరంగా ఉంటుంది. విద్యార్థులు చాలా శ్రమ పడతారు. జ్ఞాపకశక్తి పెంచుకోవాలి. భాగస్వామికి ఆధ్యాత్మికపరమైన అంశాలలో, సాంఘిక పరమైన విషయాలలో అభివృద్ధి ఉంటుంది. సంతానమునకు వృత్తిపరమైన అవకాశాలు,



## కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలోదూర ప్రదేశాలలో ఉండే చిన్ననాటి మిత్రుల సహకారం బాగుంటుంది. ధైర్యము, మీ మీద మీకు నమ్మకము పెరుగుతుంది. వృత్తిపరమైన బాధ్యతలు అధికంగా ఉంటాయి శ్రమ ఎక్కువగా ఉంటుంది .విద్యార్థులు అధిక శ్రమతో ఆశించిన ఫలితాలను పొందుతారు. ఆరోగ్యం మీద శ్రద్ధ పెరుగుతుంది. మిత్రుల, తోబుట్టువులు సహకారంతో కష్టం మీద పనులు నెరవేర్చుకుంటారు. అలంకరణ వస్తువులు కొంటారు. వారం మధ్యలో కుటుంబంలోని స్త్రీల సహకారం పొందుతారు. ఉన్నత అధికారుల సాయం కొరకు చేయు ప్రయత్నాలలో ఆలస్యం ఆటంకం ఇబ్బంది కలిగిస్తుంది వారం మధ్యలో ప్రయాణాలలో ఇబ్బందులు రాకుండా జాగ్రత్త వహించాలి. ఎదురుచూస్తున్న ఒక వార్త కొంతవరకు ఆనందాన్ని కలిగిస్తుంది.



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో ఆధ్యాత్మిక ఆలోచనల యందు, భగవంతుని ఉపాసనాపరమైన అంశాలలో ముందుకు వెళ్లడంలో కొన్ని అవరోధాలు ఎదుర్కొంటారు. ఊహించని ప్రయాణాలు కొంత చికాకును కలిగిస్తాయి. విశ్రాంతి లేని పనుల వల్ల వాటి ఫలితాల వలన కొంత అసంతృప్తి ఉంటుంది. కొత్త పరిచయాలలో అపార్థములు రాకుండా ఆలోచించి మాట్లాడాలి.ఆర్థికపరమైన విషయాలలో కుటుంబ పెద్దల సహకారాన్ని ఆశిస్తారు. వారం మధ్యలో కమ్యూనికేషన్ విషయాలలో ఆత్మీయుల మధ్య కొన్ని రకాలైన చికాకులు ఇబ్బంది పడతాయి. ముఖ్యమైన విషయాలకి మధ్యవర్తిత్వం మంచిది కాదు. వారం చివరిలో వృత్తిపరంగా రావలసిన ఆదాయాన్ని అందుకుంటారు, నూతన వృత్తుల కొరకు ప్రయత్నాలు చేస్తారు.


రష్మిక మందన్న